


రేపు విశాఖకు సీఎం చంద్రబాబు

» రాడిసన్ బ్లూ హోటల్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ మీడియేషన్ సదస్సుకు హాజరు



విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల ఐదో తేదీన విశాఖ రానున్నారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ మీడియేషన్ సదస్సుకు ఆయన హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ఉండవల్లి నివాసం ... మిగతా 8వ పేజీలో

చందన వర్ణంలో స్వయంభూ విఘ్నేశ్వరుడు



చందన వర్ణంలో భక్తులకు దర్శనమిస్తున్న స్వయంభూ విఘ్నేశ్వరుడు

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన బుధవారం చోడవరం విఘ్నేశ్వరాలయంలో స్వయంభూ గణేశుడు చందన వర్ణంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో పూజాధికాలు నిర్వహించారు. తరువాత భక్తులు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

-చోడవరం/ ఆంధ్రజ్యోతి

అల్పపీడన ప్రభావంతో మోస్తరు వర్షం

» నేడు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సమాచారం

» అప్రమత్తమైన జిల్లా అధికారులు

అనకాపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో అనకాపల్లి జిల్లాలోని పలుప్రాంతాల్లో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసినప్పటికీ.. ఆ తరువాత వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. అనకాపల్లి, మాడుగుల, దేవరాపల్లి, సబ్బవరం, కశింకోట, మునగపాక మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. నక్కపల్లి మండలంలో సాయంత్రం తరువాత సుమారు గంటపాటు భారీ వర్షం పడింది. ఇతర మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. రానున్న 24 గంటల్లో ఈదురు గాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సమాచారంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. మండల కేంద్రాల్లో అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు అవసరం మేర సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులు ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు.

అనకాపల్లిలో విద్యుత్ సర్కిల్!

మూడుచోట్ల డీఈ కార్యాలయాలు

» విశాఖ నుంచి అధికారులు, ఉద్యోగుల సర్దుబాటు

» తాత్కాలికంగా ప్రైవేటు భవనంలో ప్రారంభం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)లో కొత్తగా అనకాపల్లి జిల్లా సర్కిల్ కార్యాలయం ఏర్పాటు, ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియ మొదలైంది. కొత్త సర్కిల్ కార్యాలయాన్ని అనకాపల్లిలోని ఒక ప్రైవేటు భవనంలో ఇటీవల ప్రారంభించారు. ఇక్కడ ఎస్ఈ, ఇద్దరు ఈఈలతోపాటు పలువురు ఇంజనీర్లు, అకౌంట్ ఆఫీసర్లు, జూనియర్ అసిస్టెంట్లు, డేటా ఆపరేటర్లు వుంటారు.

» త్వరలో డీఈ కార్యాలయం ఆవరణలో సొంత భవన నిర్మాణం



సర్కిల్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించనున్న స్థలం ఇదే

గత వైసీపీ ప్రభుత్వం మూడున్నరేళ్ల క్రితం జిల్లాలను పునర్విభజన చేసినప్పటికీ ఈపీడీసీఎల్‌కు జిల్లా సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయలేదు. ఇన్‌చార్జిలను నియమించి చేతులు దులుపుకుంది. అప్పటి నుంచి విద్యుత్ పంపిణీ, బిల్లుల జారీ వంటి అన్ని కార్యకలాపాలు విశాఖపట్నం సర్కిల్ కార్యాలయం నుంచే సాగుతున్నాయి. అనకాపల్లి జిల్లా విద్యుత్ వినియోగదారులకు ఈపీడీసీఎల్ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదనే విమర్శలు, ఫిర్యాదులు వస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పలువురు ఎమ్మెల్యేలు.. అనకాపల్లి జిల్లాలో ఈపీడీసీఎల్ సర్కిల్, డివిజన్ కార్యాలయాల ఏర్పాటు ఆవశ్యకతను శాసనసభలో ప్రస్తావించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంధన శాఖ అధికారుల నుంచి వివరాలను రప్పించుకుంది. ప్రతి జిల్లాలో ఒక సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటుచేసి, ఉద్యోగులను సర్దుబాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అనకాపల్లిలో ఒక సర్కిల్ కార్యాలయంతోపాటు అనకాపల్లి, నర్సీపట్నం, కశింకోటల్లో డివిజన్ కార్యాలయాలు, అన్ని మండలాల్లో ఏఈ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. విశాఖపట్నం సర్కిల్ కార్యాలయం నుంచి పలువురు అధికారులు, సిబ్బందిని సర్కిల్, డివిజన్‌లకు సర్దుబాటు చేస్తున్నారు. కొత్త సర్కిల్ కార్యాలయాన్ని అనకాపల్లిలోని ఒక ప్రైవేటు భవనంలో ఇటీవల ప్రారంభించారు. అధికారులకు, ఉద్యోగులకు వేర్వేరుగా చాంబర్లను ఏర్పాటు చేశారు. అనకాపల్లి సర్కిల్ కార్యాలయానికి ఒక ఎస్ఈ, ఇద్దరు ఈఈలు, 44 మంది జూనియర్ ఇంజనీర్లు, 23 మంది సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, 56 మంది జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, 82 మంది జూనియర్ అసిస్టెంట్/డేటా ఆపరేటర్లను నియమించారు.



ఈపీడీసీఎల్ అనకాపల్లి కొత్త సర్కిల్ కార్యాలయం

మరింత మెరుగ్గా విద్యుత్ సేవలు



అనకాపల్లి జిల్లాకు ఈపీడీసీఎల్ కొత్త సర్కిల్‌తో పాటు, డివిజన్, ఏఈ కార్యాలయాల ఏర్పాటు వల్ల విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయి. సర్కిల్ కార్యాలయాన్ని ప్రస్తుతం అద్దె భవనంలో ఏర్పాటు చేశాం. త్వరలో అనకాపల్లిలోని డివిజన్ కార్యాలయం ఆవరణలో సొంత భవనాన్ని నిర్మించేందుకు అనుమతులు వచ్చాయి. సర్కిల్ కార్యాలయానికి బదిలీపై వచ్చిన ఉద్యోగులను మూడు డివిజన్‌లకు సర్దుబాటు చేస్తాం.

జి.ప్రసాద్, ఎస్ఈ, ఈపీడీసీఎల్, అనకాపల్లి సర్కిల్

ఉత్తమ గురువులు

రాష్ట్ర స్థాయి అవార్డులకు జిల్లా నుంచి ముగ్గురి ఎంపిక

» నాగజ్యోతి.. రోలుగుంట » డీజీ నాథ్.. శివపురం

» ఎల్‌వీ నారాయణరావు.. గొండుపాలెం



రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పీవీఎం నాగజ్యోతి, డీజీ నాథ్, లెక్కల వెంకట నారాయణరావు

అనకాపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లా నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. జిల్లా కమిటీ సిఫారసు చేసిన ఆరుగురు ఉపాధ్యాయులకు మౌఖిక పరీక్ష నిర్వహించి వారిలో రోలుగుంట జడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని పీవీఎం నాగజ్యోతి, కె.కోటపాడు మండలం గొండుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఏ (బయాలజీ) ఎల్.వెంకటనారాయణ రావు, నర్సీపట్నం మండలం శివపురం ఎంపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు డీజీనాథ్‌లను అవార్డులకు ఎంపిక చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ నెల 5వ తేదీన విజయవాడలో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు, విద్యా శాఖమంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు.

బాధ్యతను మరింత పెంచింది: నాగజ్యోతి

రోలుగుంట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధాయులుగా జిల్లా నుంచి ఎంపికైన వారిలో ఒకరైన పీవీఎం నాగజ్యోతి 25 ఏళ్ల నుంచి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ఈమె స్వగ్రామం రావికమతం మండలం కొత్తకోట. ఎంఏ (ఇంగ్లిష్), ఎంఏ (జూవాలజీ)తోపాటు ఎంఈడీ పూర్తిచేసిన నాగజ్యోతి డీఎస్సీ-1998 ద్వారా ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టారు. పాయకరావుపేట మండలం శ్రీరాంపురం ఎంపీపీ పాఠశాలలో మొట్టమొదటి పోస్టింగు. 2001 వరకు అక్కడ పనిచేశారు. తరువాత 2005 వరకు మునగపాక ఎంపీపీ పాఠశాల, 2015 వరకు రావికమతం మండలం కొత్తకోట ఎంపీపీ పాఠశాల, 2023 వరకు కన్నంపేట ఎంపీపీ పాఠశాలలో పనిచేశారు. అక్కడి నుంచి రోలుగుంట జడ్పీ పాఠశాలకు ఎస్ఏగా బదిలీపై వచ్చారు. గత ఏడాది జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుకు ఎంపికయ్యారు.

వినూత్న రీతిలో విద్యా బోధన

నాగజ్యోతి ఎప్పటికప్పుడు వినూత్న రీతుల్లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. విద్యార్థులకు ఆంగ్ల భాషపై పరిజ్ఞానాన్ని పెంపొందించడంతోపాటు సహపాఠ్య కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రతిభ, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. టీచర్‌గా పనిచేస్తూనే మరోవైపు క్రీడా పోటీల్లో ... మిగతా 8వ పేజీలో

గంజాయి వలలో యువత

డబ్బు, బైక్‌లతో ఎర వేస్తున్న స్మగ్లర్లు

నర్సీపట్నం రూరల్ పోలీసులు 2023 అక్టోబరు 22వ తేదీన చింతపల్లికి చెందిన మైనర్ బాలుడిని అరెస్టు చేసి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గత ఏడాది జనవరి 31వ తేదీన నర్సీపట్నం మండలం గబ్బాడ శివారు ప్రాంతంలో గంజాయి లోడు చేస్తుండగా ముగ్గురు విద్యార్థులను అరెస్టు చేసి 46 కిలోల గంజాయి సీజ్ చేశారు.

గత ఏడాది జూలై 20వ తేదీన ధర్మసాగరం జంక్షన్ వద్ద గంజాయి రవాణా కేసులో మైనర్ బాలుడిని రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. గత ఏడాది నవంబరు నాలుగో తేదీన కృష్ణా జిల్లాకు చెందిన విద్యార్థిని అరెస్టు చేసి మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తాజాగా సెప్టెంబరు 2వ తేదీన పట్టణ పోలీసులు గంజాయి రవాణాదారులకు పైలట్‌గా వ్యవహరించిన మైనర్ బాలుడుని అరెస్టు చేశారు.

» గంజాయి వ్యాపారుల చేతుల్లో పావులుగా మారుతున్న విద్యార్థులు

» మైనర్లను సైతం వాడుకుంటున్న వైనం

» ఒడిశాలో గంజాయి కొనుగోలు

» అల్లూరి, అనకాపల్లి జిల్లాల మీదుగా రవాణా

» పోలీసుల చెక్‌పోస్టులు తగలకుండా వేరే మార్గాల్లో తరలింపు

నర్సీపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడుతున్న వారిలో ఎక్కువ మంది 25 ఏళ్ల లోపు యువకులు, 15 నుంచి 18 ఏళ్లలోపు మైనర్లు వుండడం సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నది. వీరు గంజాయి సేవించడంతో పాటు రవాణాకు కూడా సహకరిస్తున్నారు. గంజాయి వ్యాపారులు.. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన మైనర్లు, 25 ఏదేళ్లలోపు యువకులను లక్ష్యంగా చేసుకొంటున్నారు. తొలుత వీరికి గంజాయి సేవించడాన్ని అలవాటు చేస్తున్నారు. అనంతరం జల్సాలకు డబ్బులతోపాటు బైక్‌లు కూడా ఇచ్చి గంజాయి రవాణాకు వాడుకుంటున్నారు. గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు దొరికిపోతున్న వారిలో పలువురు విద్యార్థులు.. ముఖ్యంగా ఇంజనీరింగ్ చదువుతున్న వారు కూడా వుండడంతో ఆందోళన కలిగిస్తున్నది. కళాశాలలోనే గంజాయి సేవించడం అలవాటు అయిందని వీరు చెప్పడం గమనార్హం.



పోలీసులు సీజ్ చేసిన గంజాయి ప్యాకెట్లు (ఫైల్ ఫొటో)

చెక్ పోస్టులను తప్పించుకొని గంజాయి రవాణా

అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి ఆనుకొని వున్న ఒడిశా రాష్ట్రంలో గంజాయి సాగవుతున్నది. ఇక్కడ కొనుగోలు చేసిన గంజాయిని ... మిగతా 8వ పేజీలో

గంజాయి వ్యాపారుల ఆస్తుల జప్తు



గంజాయి రవాణాను నిరోధించడానికి నిఘాను కట్టుదిట్టం చేశాము. ప్రధాన రహదారులతోపాటు ఇతర మార్గాల్లో తనిఖీలు ముమ్మరం చేశాము. డ్రోన్లను ఉపయోగించి గంజాయి సేవిస్తున్న వారిని గుర్తిస్తున్నాం. గంజాయి వ్యాపారుల ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకుంటున్నాము. గంజాయి రవాణా చేసే వ్యక్తులు, సేవించే వారు వున్న గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. గంజాయి రవాణా చేస్తూ పట్టబడిన మైనర్లు, యువకులకు కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం.

పోతురెడ్డి శ్రీనివాసరావు, డీఎస్పీ, నర్సీపట్నం

అరకొర బస్సులు

విజయరామరాజుపేట వద్ద కాజ్‌వే కూలిపోవడంతో పలు సర్వీసులను ఆపేసిన ఆర్టీసీ అధికారులు

» మిగిలిన బస్సులు ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లింపు

» చోడవరం, అనకాపల్లి, విశాఖ వెళ్లడానికి గంటల తరబడి నిరీక్షణ

» ప్రయాణికుల అవస్థలు పట్టించుకోని అధికారులు



పల్లె వెలుగు బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

మాడుగుల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):

బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిపై కాజ్‌వే కొట్టుకుపోవడంతో ఇతర మండలాల కంటే మాడుగుల మండల ప్రజలు ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విశాఖపట్నం, అనకాపల్లి నుంచి మాడుగులకు నడిచే ఆర్టీసీ బస్సు సర్వీసులను కుదించడం, మిగిలిన బస్సులను ఇతర మార్గాల్లోకి మళ్లించడంతో ప్రయాణికులు తీవ్ర అసౌర్యానికి గురవుతున్నారు.

విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిపై బ్రిటీష్ హయాంలో నిర్మించిన వంతెన రెండేళ్ల క్రితం కూలిపోయింది. మాడుగుల, రావికమతం మండలాల నుంచి అధిక గ్రానైట్ లోడుతో వెళ్లే భారీ వాహనాలే వంతెన కూలిపోవడానికి కారణమని ప్రజలు ఆరోపించారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం ఇక్కడ వెంటనే పక్కా వంతెన నిర్మాణ పనులు చేపట్టలేదు. కూలిపోయిన వంతెన పక్కన, నదిలో సిమెంట్ తూరలు వేసి, తాత్కాలికంగా కాజ్‌వే నిర్మించి చేతులు దులుపుకుంది. వర్షాకాలంలో తాచేరు వరద ఉధృతికి కాజ్‌వే కొట్టుకుపోతున్నది. సుమారు మూడు వారాల నుంచి కురుస్తున్న వర్షాలతో కాజ్‌వే పూర్తిగా ధ్వంసమైంది. దీంతో చోడవరం వైపు నుంచి వడ్డాది. ఆపై ప్రాంతాలకు వాహనాల రాక పోకలకు వీలుకాని పరిస్థితి నెలకొంది. చోడ వరం వైపు నుంచి రావికమతం, రోలుగుంట, నర్సీపట్నం వైపు వెళ్లే వాహనాలను గౌరీపట్నం మీదుగా మళ్లించారు. ఇక వడ్డాది మీదుగా మాడుగుల, పాడేరు వైపు వెళ్లాల్సిన వాహనాలను చోడవరంలో పూర్ణా థియేటర్ రోడ్డు, దామునాపల్లి, వరహాపురం, జి.కొత్తపల్లి, జైతవరం, అప్పలరాజుపురం మీదుగా కేజే పురం జంక్షన్ వద్ద వడ్డాది- పాడేరు ప్రధాన రహదారిలోకి మళ్లించి నడుపుతున్నారు.దీనివల్ల సుమారు పది కిలోమీటర్ల మేర అదనంగా ప్రయాణించాల్సి వస్తున్నది. ఇదిలావుండగా విజయరామరాజుపేట వద్ద కాజ్‌వే కొట్టుకుపోవడంతో విశాఖపట్నం, అనకాపల్లి నుంచి మాడుగులకు నడిచే బస్సు సర్వీసులను అధికారులు కుదించారు. 300ఎం సిటీ సర్వీసు బస్సుల్లో రెండు మినహా మిగిలిన వాటిని చోడవరం వరకే నడుపుతున్నారు. పల్లె వెలుగు బస్సుల్లో కొన్నింటిని దామునాపల్లి, జి.కొత్తపల్లి, జైతవరం, అప్పలరాజుపురం మీదుగా, మరి కొన్నింటిని అనకాపల్లి నుంచి కూండ్రం, కందిపూడి, రాజాం, బుచ్చెయ్యపేట, వడ్డాది మీదుగా నడుపుతున్నారు. పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల నుంచి మాడుగుల రాకపోకలు సాగించే వారు బస్సుల కొరతతో ఇబ్బంది పడుతున్నారు. అధిక చార్జీలను చెల్లించి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్ఈసీఎస్ ఉద్యోగులకు ఝలక్

తీర్పు వచ్చేంత వరకూ పాత జీతాలే ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశం

» పీఆర్‌సీకి ముందు జీతాలే ఇచ్చిన ఈపీడీసీఎల్



విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సరఫరా సంఘం (ఆర్ఈసీఎస్) ఉద్యోగులకు హైకోర్టు ఝలక్ ఇచ్చింది. కేసు తేలేంత వరకూ పాత జీతాలే ఇవ్వాలని ఈపీడీసీఎల్‌ను ఆదేశించింది. దాంతో అధికారులు ఆగస్టు నెల జీతాల కింద పీఆర్‌సీకి ముందు మొత్తాలే విడుదల చేశారు. ఒక్కో ఉద్యోగికి సగటున రూ.20వేలు తగ్గిపోయింది. సొసైటీలో అడ్డగోలు వ్యవహారాలు జరుగుతున్నాయని 'ఆంధ్రజ్యోతి' ఎప్పటికప్పుడు కథనాలు ప్రచురిస్తూనే ఉంది. ఇటీవల శాశ్వత ఉద్యోగులు 72 మంది తమకు పే రివిజన్ కమిషన్ 2022 సిఫారసుల ప్రకారం జీతాలు ఇవ్వాలని ఈపీడీసీఎల్ అధికారులను కోరారు. దీనికి గతంలో సొసైటీ చేసిన పాత తీర్మానం కాపీని జతచేశారు. అంతా కుమ్మక్కు అయిపోవడంతో ఈ ఏడాది మే నెలలో వారికి ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు జీతాలు పెంచుతూ పీఆర్‌సీ ఇచ్చారు. అయితే వారిలో కొందరు అతి తక్కువ కాలంలో రెండేసి ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు తీసుకున్నారని, సస్పెన్షన్‌లో ఉన్నవారు కూడా పదోన్నతులు తీసుకున్నారని, అర్హతలు లేకుండా ప్రమోషన్ పొందారని సర్వీస్ రికార్డుల పరిశీలన ద్వారా ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు గుర్తించారు. అటువంటి వారందరికీ జూలై నెలలో పాత జీతాలనే ఇచ్చారు. దీనిపై గుర్రుమన్న ఉద్యోగులు కొందరు హైకోర్టును ఆశ్రయించారు. తమకు ఇచ్చినవి వెనక్కి తీసుకున్నారని పిటిషన్ వేశారు. పూర్తి జీతాలు ఇప్పించాలని కోరారు. ఇదే సమయంలో పీఆర్‌సీ ప్రస్తావన కూడా వచ్చింది. సొసైటీలకు పీఆర్‌సీ ఎలా ఇస్తారంటూ వాదనలు ... మిగతా 8వ పేజీలో

'శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉద్యోగావకాశాలు'


శాస్త్రవేత్త డాక్టర్ శివాజీని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఎలమంచిలి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక శాస్త్ర, సాంకేతిక రంగాలను విద్యార్థులు సక్రమంగా అధ్యయనం చేస్తే అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని భారత శాస్త్ర సాంకేతిక రంగాల అత్యున్నత స్థాయి శాస్త్రవేత్త డాక్టర్ శివాజీ చదరం అన్నారు. పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం భౌతిక శాస్త్ర, కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో ముఖ్య అతిథిగా మాట్లాడారు. వేదకాలం నుంచి భారతదేశం సైన్సు ప్రయాణాన్ని, స్వాతంత్ర్యానంతరం జరిగిన శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిని ఆయన క్షుణ్ణంగా వివరించారు. ప్రస్తుతం శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రపంచంలో అత్యున్నత దేశాలలో భారత్ ఒకటిగా పేరుగాంచిందన్నారు. ఈ సందర్భంలో సైన్సు అభివృద్ధి, పరిశోధనలకు మన దేశం జపాన్, జర్మన్, ఫ్రాన్స్, యూఎస్‌లతో ఒప్పందాల ద్వారా శాస్త్ర సాంకేతిక పరిశోధనలకు తోడ్పాటు అందిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు వీటిలో పరిశోధనలు చేస్తే అటువంటి వారికి మనదేశంతో పాటు ఒప్పందం కుదుర్చుకున్న దేశాలలోనూ ఉపాధి, ఉద్యోగావకాశాలు విరివిగా లభిస్తాయని వివరించారు. విద్యార్థులు ఈ దిశగా విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం అతనిని ఘనంగా సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ రేఖా రామారావు, అధ్యాపకులు పి.ఎస్.జగ్గారావు, కె.వెంకన్న, మార్టిన్ తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన 'విజిలెన్స్'


ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అధికారులు

మునగపాక, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు, విత్తనాల విక్రయాల్లో నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని విజిలెన్స్ అధికారి టి.అప్పలనాయుడు హెచ్చరించారు. మండల కేంద్రం మునగపాకలో ఉన్న ప్రైవేటు ఎరువుల దుకాణాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. విక్రయాలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. బిల్ బుక్ తదితర రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారిణి సిహెచ్.జ్యోత్స్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

8న ఉపకరణాల గుర్తింపు శిబిరం

మునగపాక, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : ఎలమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల ఎనిమిదో తేదీన నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల పంపిణీకి సంబంధించి గుర్తింపు ప్రక్రియ జరగనుందని ఎంఈవో వేణుగోపాలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షణ, అల్మికో సంస్థ సంయుక్తంగా 18 సంవత్సరాలు లోపు దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేయనుందని వివరించారు. అర్హులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

అర్జీలపై అలక్ష్యం వద్దు

▸▸ 'జనవాణి'లో అధికారులకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆదేశం ▸▸ వివిధ ప్రాంతాల నుంచి 60 మంది విచ్చేసి సమస్యలపై నివేదన


జనవాణిలో ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఎలమంచిలి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికే జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని జడ్పీ అతిథి గృహం ఆవరణలో బుధవారం ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు విన్నవించే ప్రతి సమస్య పరిష్కారానికి అధికారులు కృషిచేయాలన్నారు. అప్పుడే ఇటువంటి కార్యక్రమాలపై ప్రజల నుంచి మరింత ఆదరణ పెరుగుతుందని వివరించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ అలక్ష్యం చూపవద్దని స్పష్టం చేశారు. ఇదిలావుంటే, వివిధ ప్రాంతాల నుంచి అరవై మంది విచ్చేసి అర్జీలను సమర్పించారు. పలువురితో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మునిసిపాలిటీ పరిధి పెదపల్లిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను వసతి సమస్య వేధిస్తోందని, త్వరతిగతిన ఈ సౌకర్యం కల్పించాలని జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను కోరారు. అలాగే, మరిన్ని సమ్యసలను ఆయా ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధి కారులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి వినతి


ఎంపీడీవోకు వినతి అందిస్తున్న ప్రతినిధులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలతో పాటు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడారి నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చాలీచాలని జీతాలతో గ్రామ పంచాయతీ కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే జీతాలు పెంచటంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, గుర్తింపు కార్డులు, సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని ఆయన కోరారు. అనంతరం ఎంపీడీవో సత్యవరాహ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కూండ్రపు సోమునాయుడు, పి.సత్తి బాబు, సిహెచ్.రాంబాబు, సూరిబాబు, దేముడు, శ్రీరాములు పాల్గొన్నారు.

చెర్లోపాలెం ఆరోగ్య ఉప కేంద్రం
జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న బృందం సభ్యులు

మునగపాక, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెర్లోపాలెం గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం బుధవారం తనిఖీ చేసింది. జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ ఎ.రామచంద్రరావు, డేటా మేనేజర్ వై.జనార్థన్‌లు ఉప కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆన్‌లైన్ అప్‌లోడ్, రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈవో గుర్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

2026 నాటికి ఉమ్మడి ఐదు జిల్లాల్లో 300పైగా పార్లర్లు

▸▸ చిత్తూరు జిల్లాలో 15 బల్క్ కూలింగ్ కేంద్రాల నిర్వహణ బాధ్యతలు

▸▸ బీజేపీ నాయకుడు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్


గవర్ల అనకాపల్లిలో పార్లర్‌ను ప్రారంభిస్తున్న ఆనంద్‌కుమార్

మునగపాక, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు జిల్లాలో 15 బల్క్ కూలింగ్ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం అప్ప గించిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. మండలంలోని గవర్ల అనకాపల్లిలో బుధవారం రూరల్ మిల్క్ పార్లర్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ సేవలు సామాన్యులకు చేరువ చేయడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2026 నాటికి ఉమ్మడి ఐదు జిల్లాల్లో 300పైగా పార్లర్లు ప్రారంభించనున్నామని వివరించారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి, కోటేశ్వరరావు, డెయిరీ అధికారులు కె.వి.ప్రసాద్, హరి, సోమునాయుడు, శరగడం రమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి వేడుకలు


దీపారాధనలో పాల్గొన్న మహిళలు

ఎలమంచిలి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వినాయక నవరాత్రి వేడుకలు వాడవాడలా ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పట్టణంలోని రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయంలో ఏర్పాటు చేసిన వినాయక మండలంలో బుధవారం సామూహిక హారతి కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాలనీ సంఘం ప్రతినిధులు బొడ్డేటి ప్రసాద్, హైరామ్, ఎస్ఎస్ఎఫ్ ఉత్తరాంధ్ర ప్రతినిధి ఆడారి గంగాధర్, సభ్యులు శ్రీను, రమేశ్, జగదీష్, లోకేశ్, లక్ష్మణరావు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రాంబిల్లి : కొప్పుగొండుపాలెంలోని రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద బుధవారం గ్రామ పెద్దలు ఘనంగా లక్ష గరిక పూజను నిర్వహించారు. సీఐ సిహెచ్ నరసింగరావు, జనసేన పార్టీ ఢుండల శాఖ అధ్యక్షుడు పప్పల నూకన్న దొర, పలు గ్రామాలకు చెందిన పెద్దలు స్వామిని దర్శించుకున్నారు.

బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సత్కారం


జంపపాలెం గ్రామస్థుల సత్కారం పొందిన ఉపాధ్యాయులు

ఎలమంచిలి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన పది మంది ఉపాధ్యాయులను గ్రామస్థులు బుధవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సేవలను వారంతా ప్రశంసించారు. విద్యార్థులకు చక్కని విద్యాబుద్ధులు నేర్పుతూ పాఠాలను బోధించేవారన్నారు. వీరి సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

రోగుల పట్ల నిర్లక్ష్యం తగదు: ఎంపీడీవో

నక్కపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని ఎంపీడీవో డి.సీతారామరాజు సూచించారు. మండలంలోని గొడిచెర్ల పీహెచ్‌సీని డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావుతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు, సిబ్బంది హాజరును పరిశీలించారు. వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. మందులు అందుబాటులో వున్నాయా? లేదా? అని స్టోర్ రూం పరిశీలించారు. రాత్రి వేళల్లో రోగులకు సకాలంలో సేవలు అందించాలని ఆయన సూచించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, స్థానిక నేత అల్లు రమణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి


పోస్టర్ విడుదల చేస్తున్న గెడ్డం బుజ్జి

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 17వ తేదీన నిర్వహించే భారతీయ ధర్మ పరిషత్ చైతన్య పాదయాత్ర, సనాతన ధర్మ మహాసభను విజయవంతం చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి పిలుపునిచ్చారు. గుంటపల్లిలో అనకాపల్లి జిల్లా అధ్యక్షులు రామాల శివ నాగేశ్వరరావుతో కలిసి బుధవారం పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మం కోసం ప్రతీ ఒక్కరూ పాటుపడాలన్నారు. పలు విషయాలను మహాసభలో చర్చిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తుని ఎమ్మెల్యే యనమల దివ్య హాజరవుతారన్నారు. పట్టణంలోని పాండురంగస్వామి ఆలయం నుంచి వై.జంక్షన్ వరకు యాత్ర సాగుతుందన్నారు. కార్యక్రమంలో నామవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్ గెడ్డం కన్నబాబు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో వైద్య సేవలు మెరుగుపర్చండి


పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో డేవిడ్

పాయకరావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వివిధ ఆరోగ్య సమస్యలపై వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ ఎంపీడీవో కె.డేవిడ్ ఆదేశించారు. మండలంలోని పాయకరావుపేట, మంగవరం, శ్రీరాంపురం పీహెచ్‌సీలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ రికార్డులు, రోగులకు అందుతున్న వైద్యసేవలు, ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత, సిబ్బంది సమయపాలన తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నందున ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. అత్యవసర సేవలు అవసరమైన వారు వెంటనే పీహెచ్‌సీలకు వెళ్లేలా చూడాలన్నారు. అదే విధంగా పీహెచ్‌సీలకు వచ్చేవారికి మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. ఆసుపత్రుల్లో అవసరమైన మందులు పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

▸▸ జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు


ఎరువులను పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

నక్కపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వరి సాగు చేసే రైతులు మేలైన దిగుబడులు సాధించాలంటే మోతాదుకు మించి ఎరువులు వాడకూడదని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు సూచించారు. మండలంలోని ఉపమాక గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు అవసరమైన ఎరువులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నక్కపల్లి మండలంలో ఇప్పటి వరకూ 216 మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చామని, మరో 60 టన్నుల ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మరో ఆరు రైతు సేవా కేంద్రాలకు 72 మెట్రిక్ టన్నుల ఎరువులు వస్తాయన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో వరికి ప్రత్యామ్నాయ పంటలుగా ఏం వేయాలో వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా ఆరోగ్య భద్రత, పర్యావరణ పరిరక్షణ కాపాడేవారవుతామన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు తగిన మోతాదులో వాడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి వెంకటేష్, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొండబాబు, ఏఈవో సత్యనారాయణ, వ్యవసాయ శాఖ సిబ్బంది సాయికుమారి, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఒడ్డిమెట్ట గణపతి గిరి ప్రదక్షిణోత్సవం

▸▸ తొలిసారిగా కైలాసగిరి చుట్టూ భక్తుల పాదయాత్ర


గిరి ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న నాయకులు... (ఇన్‌సెట్‌లో) భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

నక్కపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడ్డిమెట్ట గ్రామంలో తొలిసారిగా బుధవారం గిరి ప్రదక్షిణోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దాదాపు శతాబ్ద కాలం క్రితం ఒడ్డిమెట్ట కైలాసగిరిపైన స్వయంభూ లక్ష్మీగణపతి ఆలయాన్ని భక్తులు కనుగొన్నారు. ఆ తరువాత అంచెలంచెలుగా ఆలయం అభివృద్ధి చెందుతోంది. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏటా బాధ్రపదశుద్ధ ఏకాదశి రోజున స్వామివారి గిరి ప్రదక్షిణ చేయాలని పెద్దలు, ప్రముఖులు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం తెల్లవారుజామున ఆలయంలోని స్వయంభూ గణపతి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల సమక్షంలో కోలాట ప్రదర్శనలు, తప్పెటగుళ్ల కోలాహలంతో గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. కొండ దిగువన వున్న స్వామివారి మందిరం వద్ద పూజలు చేసి, హారతులిచ్చి గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుట్టారు. ఒడ్డిమెట్ట హైవే నుంచి పాత రోడ్డు, గుంటపల్లి మీదుగా యాత్ర సాగింది. అనంతరం ఆలయానికి చేరుకున్నారు. పాదయాత్ర సమయంలో భక్తులు భక్తిపారవశ్యంతో మునిగిపోయారు. కార్యక్రమంలో తోట నగేశ్, గెడ్డం బుజ్జి, వీసం రామకృష్ణ, శీరం నరసింహమూర్తి, యాళ్ల వరహాలు, చెంచలపు పద్దు, జగతా శ్రీను, చిక్కాల శ్రీను, సర్పంచ్ రాఘవకుమారి పాల్గొన్నారు

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపట్నం పాఠశాలలో ఎంఈవో రమేశ్, క్లస్టర్ హెచ్ఎం విజయలక్ష్మి బుధవారం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజనం రుచికరంగా, వండుతున్నారో లేదోనని పరీక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పీఎస్‌వీ.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరు వక్రీకరించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

పాయకరావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పేరును వక్రీకరించి కల్యాణ్ సీమ జిల్లా అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటుచేసిన వారిపైచట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. కోనసీమ ప్రాంతంలో ఇటువంటి ఫ్లెక్సీలను ఏర్పాటుచేసి విద్వేషాలు రెచ్చగొట్టడం సరికాదన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినవారిని పోలీసులు తక్షణం అరెస్టుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.దావీదు దాసరి అన్నపూర్ణ డి.రామచంద్రరావు, బి.అచ్చారావు, ఎస్.రాధకృష్ణ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

పాయకరావుపేట, సెప్టెం బరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంకి చెందిన మహిళ పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను పాయకరావుపేట పోలీసులు పట్టుకుని అందజేశారు. ఎస్ఐ పురుషోత్తం బుధవారం ఈ వివరాలను అందించారు. గాజువాక ప్రాంతానికి చెందిన వెలుగుల వరలక్ష్మి గాజువాక నుంచి కాకినాడ జిల్లా చేబ్రోలులో వెళ్తూ మార్గమధ్యంలో నామవరం జంక్షన్ వద్ద ఫోన్ పోగొట్టుకున్నారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు సీఐ జి.అప్పన్న కానిస్టేబుళ్లు సతీశ్, మదీనాలను అప్రమత్తం చేశారు. వెంటనే నామవరం చేరుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి పట్టుకున్నారు. ఈ ఫోన్ బుధవారం అందజేశారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి: ఏవో

పాయకరావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ-పంట నమోదు చేసుకోవడం తప్పనిసరి అని ఏవో పి.ఆదినారాయణ తెలిపారు. పెదరాంభద్రపురం గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ సమగ్ర సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏలు సాధన, శ్రావణ్ రైతులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా

నర్సీపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవిద్య కళాశాలలో హెట్రో ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులతో పాటు బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన 100 మంది పేర్లు నమోదు చేయించుకోగా వారిలో 53 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ గాడి సత్యవతి, డైరెక్టర్ దొరబాబు, ప్రిన్సిపాల్ నానాజి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై విజిలెన్స్ విచారణ

పాయకరావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పంచాయతీలో అక్రమ లేఅవుట్లు, పంచాయతీ స్థలాల ఆక్రమణలపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత విజిలెన్స్ విచారణ వేయనున్నారు. ఇటీవల రాజుగారిబీడులో పంచాయతీ స్థలం ఆక్రమణ బయటపడిన నేపథ్యంలో పాయకరావుపేట మేజరు పంచాయతీలో ఇప్పటి వరకు వేసిన లేఅవుట్లతో పాటు పంచాయతీకి కేటాయించిన కమ్యూనిటీ స్థలాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టేందుకు విజిలెన్స్ ఎంక్వైరీకి ఆదేశించినట్టు మంత్రి తెలిపారు.

డ్రోన్‌తో ఎరువుల పిచికారీ

కోటవురట్ల, సెప్టెంబరు 3 ఆంధ్రజ్యోతి): మండలంలోని యండపల్లి, టీకేపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డ్రోన్ వినియోగంతో వరి పొలాల్లో నాలో యూరియా స్ప్రేయింగ్ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి సరోజని మాట్లాడుతూ పంటలకు డ్రోన్ వినియోగం ద్వారా ఎరువులు పిచికారీ చేసుకుంటే ఖర్చు తగ్గుతుందన్నారు. అనంతరం డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షులు పి.లింగంనాయుడు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహితులకు ప్యాకేజీ ఇవ్వాలి

నక్కపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా భూములు ఇచ్చిన నిర్వాసిత రైతు కుటుంబాల్లో వివాహితులకు కూడా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని చందనాడ పంచాయతీ పరిధిలో నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు చేశారు. ఇళ్లు కోల్పోతున్న కుటుంబాల్లో వివాహితులకు కూడా న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

నక్కపల్లిలో భారీ వర్షం

నక్కపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వేసవిని తలపించే స్థాయిలో భానుడు భగ్గుమన్నాడు. సాయంత్రం ఆకాశం మేఘావృమైంది. అనంతరం భారీ వర్షం పడింది. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి పంట పొలాల్లో నీరు చేరింది. ఈ వర్షం వరికి ఎంతో మేలు చేస్తుందని అన్నదాతలు చెప్పారు.

ఆక్రమిత స్థలాలు స్వాధీనం చేసుకోండి

పాయకరావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పంచాయతీలో ఆక్రమిత స్థలాలను అధికారులు స్వాధీనం చేసుకోవాలని దళిత నాయకులు ఇంజరపు సూరిబాబు, టి.లోవరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ ఎంపీడీవో కె.డేవిడ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవీనగర్ లేఅవుట్లలో పంచాయతీకి కేటాయించిన రెండు స్థలాలు ఆక్రమించారని, లేఅవుట్లలోనూ ఆక్రమణలు ఉన్నాయని ఆరోపించారు. అధికారులు స్పందించి ఈ స్థలాలను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుని రక్షణ కల్పించాలని కోరారు. నాయకులు ఐఎస్.మూర్తి, జి.నాగు, జి.రమేష్ జి.రాజ కె.కుమార్, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బారినుంచి కాపాడాలని ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద అసోసియేషన్ ప్రతినిధుల ఆందోళ

తుమ్మపాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లిలో వీధి కుక్కలు పెరిగిపోయాయని, వీటి బారినుంచి ప్రజలను కాపాడాలని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం కోరారు. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆర్డీవో కార్యాయం వద్ద ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో వీధి కుక్కల కాటుకు గురై పెద్ద సంఖ్యలో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. ఈ అంశంపై అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాల్సిందిగా కోరారు. అనంతరం ఆర్డీవో షేక్ ఆయిషాకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణ మోహన్, రామారావు, రమణమూర్తి, నేతాజీ, సత్యారావు పాల్గొన్నారు.

బకాయి వేతనాల కోసం ఉపాధి కూలీల ధర్నా



పని ప్రదేశంలో ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు, చిత్రంలో గనిశెట్టి

పరవాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ పథకం కూలీలు బొద్దపువానిపాలెం గ్రామంలోని పని ప్రదేశంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కూలీల బకాయి వేతనాలను సకాలంలో చెల్లించకపోవడం వల్ల వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి కుటుంబానికి ఏడాదికి రెండు వందల రోజుల పనిదినాలు కల్పించాలని, కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి పథకానికి రెండు లక్షల కోట్లు కేటాయించాలని, కొలతలతో సంబంధం లేకుండా జీవో ప్రకారం రోజుకు రూ.309 వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, కూలీలకు పనిముట్లు ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీల ప్రతినిధులు ఈశ్వరరావు, సోమునాయుడు, శంకరరావు, అప్పలనాయుడు, రమణ, మహాలక్ష్మి, అప్పలనర్స తదితరులు పాల్గొన్నారు.

'పంటలకు ప్రస్తుతం పురుగు మందులు వాడవద్దు'



మామిడిపాలెంలో వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తుమ్మపాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పంటలకు పురుగు మందులను వాడాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి అన్నారు. అనకాపల్లి మండలం మామిడిపాలెం, పాపయ్యపాలెం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోందని కార్యక్రమంలో రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వరి పొలాల్లో ఎలాంటి చీడపీడలు లేవన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియా వాడాల్సిందిగా సూచించారు. వరి ఉడుపులు జరిగి ఐదు నుంచి పదిహేను రోజులు అవుతున్నందున తప్పనిసరిగా కాంప్లెక్స్ ఎరువులు 25కేజీలు, యూరియా 25కేజీలు కలిపి వేసుకోవాలన్నారు. దీంతో దుబ్బులు ఎక్కువ పిలకలను పెట్టి అధిక దిగుబడి రావడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు జ్యోత్స్న, హిమవాణి, సత్యారావు, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు పంపిణీ



బాధితులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న జనసేన నాయకులు

కశింకోట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కశింకోట, బయ్యవరం, ఉగ్గినపాలెం, కన్నూరుపాలెం తదితర గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సేవల నిమిత్తం బుధవారం సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. జనసేన పార్టీ నాయకులు కర్రి సత్యనారాయణ, కలిగెట్ల సింహాద్రి, బలిజ ముసిలినాయుడు, వీరబాబు వీటిని అందజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కొత్తూరు/తుమ్మపాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం 11కేవీ ఫీడర్ పనులు శుక్రవారం జరగనున్న నేపథ్యంలో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఈ కారణంగా రఘురామ్ కాలనీ, సర్వేపల్లి రాధాకృష్ణ కాలేజీ ఏరియా, సత్తెమ్మతల్లి ఆర్చి, గోపాలకృష్ణ థియేటర్, బ్యాంకు కాలనీ, వైజాగ్ రోడ్డు, డైట్ కళాశాల కొప్పాక బ్రిడ్జి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదే విధంగా గాంధీనగర్ ఫీడర్ వద్ద మరమ్మతు పనులు కారణంగా పార్కు సెంటర్, గౌరీ సంఘం, సతకంపట్టు, సంతోషిమాత ఆలయం, రింగురోడ్డు ఏరియా నుంచి బాలకృష్ణ బస్టాప్ వరకు, రైతు భారతి కళ్యాణ మండపం ఏరియా, దాడి భోగలింగం స్కూల్ ఏరియా వరకు అంతరాయం కలుగుతుందని వివరించారు.

లంకెలపాలెం : పెదముషిడివాడ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాను పలు ప్రాంతాలకు నిలిపివేస్తున్నట్టు ఏఈ వినోద్ తెలిపారు. ఈ కారణంగా ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు లంకెలపాలెం, శ్రీరామ్‌నగర్, గంగిరెడ్ల కాలనీ, వినాయక నగర్, గెంజిపేట, గొల్లపేట, ఇండస్ట్రియల్ ఏరియా, శ్రీరామ్‌నగర్, పెదముషిడివాడ, నక్కవానిపాలెం, పచ్చికోరువానిపాలెం, గండివానిపాలెం, విజయరాంపురం, మార్కండేయనగర్, ఇ- మర్రిపాలెం, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, గొన్నవానిపాలెం, కన్నూరు, మంత్రిపాలెం, మడకపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం జరగనున్నట్టు జీవీఎంసీ కార్యదర్శి టీవీరమణ తెలిపారు. ఇందుకోసం 198 అంశాలతో అజెండా తయారుచేసి సభ్యులకు అందజేశామన్నారు. నీటిసరఫరా పైప్‌లైన్‌ల మరమ్మతులు, కొత్తవాల్వ్‌ల ఏర్పాటు, ఫెర్రిక్‌ఆలం, నీటిశుద్ధి రసాయనాల కొనుగోలు, ట్యాంకర్లను అద్దెప్రాతిపదికన తీసుకోవడం వంటి 50 అంశాలను పొందుపరిచారు. కొన్ని జోన్‌ల పరిధిలోని చెత్త ట్రాన్స్‌ఫర్‌స్టేషన్ల వద్ద తడి-పొడి చెత్త విభజనకు ర్యాగ్‌పిక్కలను నెలవారీ అద్దెప్రాతిపదికన ఏడాది కాలానికి విధుల్లోకి తీసుకోవడం, తాత్కాలిక పారిశుధ్య కార్మికులకు వేతనాల చెల్లింపు, డ్రెయిన్‌లు, కల్వర్టులు, భవనాలు, రోడ్లు నిర్మాణాలు, గెడ్డల్లో పూడిక తీతకు యంత్రాలను సమకూర్చడం, బీచ్‌రోడ్డులో పారిశుధ్య నిర్వహణకు నియమించిన తాత్కాలిక కార్మికులకు వేతనాల చెల్లింపు, పారిశుధ్య కార్మికులకు యాప్రాన్‌లు కొనుగోలు, జీవీఎంసీ వాణిజ్య సముదాయాల్లోని దుకాణాల వేలం, నిరాశ్రయుల కోసం జీవీఎంసీ నిర్వహిస్తున్న ఆశ్రయ కేంద్రాల నిర్వహణను ఎన్‌జీవోలకు అప్పగించడం వంటి అంశాలను అజెండాలో చేర్చారు.

గుంతల మయం.. ప్రయాణాలు భయం..

- పరవాడలోని జంక్షన్లలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి
- రాకపోకలకు హడలిపోతున్న వాహనదారులు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు



పెట్రోల్‌బంక్ కూడలిలో దెబ్బతిన్న రహదారి



ఊటగెడ్డ కూడలి వద్ద రహదారి పై ఏర్పడిన గొయ్యి



పరవాడ సినిమాహాల్ కూడలిలో రహదారిపై...

పరవాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలోని పలు జంక్షన్లలో రహదారులు అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ గోతులు పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సినిమాహాల్ కూడలి, పెట్రోల్ బంక్ కూడలి, మండల పరిషత్ కూడలి, ఊటగెడ్డ కూడలిలలో మరీ దారుణంగా ఉన్నాయి. ఈ జంక్షన్‌ల మీదుగా గాజువాక, సింధియా, విశాఖపట్నం, అచ్యుతాపురం, ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీ తదితర ప్రాంతాలకు విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, సాధారణ ప్రయాణికులతో పాటు పరిశ్రమలకు యంత్ర సామగ్రిని తరలించే భారీ వాహనాలు నిత్యం అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. కూడళ్ల వద్ద ఏర్పడిన గుంతల కారణంగా పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి సమయాల్లో ఈ కూడళ్లపై నుంచి ప్రయాణించాలంటేనే హడలిపోతున్నారు. గుంతల కారణంగా రహదారి ధ్వంసం కావడంతో పలువురు ద్విచక్ర వాహనదారులు చిన్నచిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. ఐదు నెలల క్రితమే ఈ కూడళ్లలో రహదారికి మరమ్మతులు చేపట్టారు. ఇంతలోనే భారీ గుంతలు ఏర్పడడంతో ఆర్అండ్‌బీ శాఖ అధికారుల తీరుపై అంతా మండిపడుతున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే మూన్నాళ్లకే పరిస్థితి యథాతథంగా మారిందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కూడళ్ల వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చివేసి, పూర్తి స్థాయిలో మరమ్మతు పనులు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

యువతకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

- సీఐపీఈటీతో సింహాద్రి ఎన్టీపీసీ ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపిస్తున్న ఈడీ సమీర్‌శర్మ, సీఐపీఈటీ జేడీ శేఖర్

పరవాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ సామాజిక బాధ్యతలో భాగంగా పరవాడ ప్రాంతంలో గల నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించేందుకు సింహాద్రి యాజమాన్యం విజయవాడకు చెందిన సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ టెక్నాలజీ (సీఐపీఈటీ)తో బుధవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో నాలుగు నెలల వ్యవధిలో ఒక్కొక్క బ్యాచ్‌కు 30 మంది అభ్యర్థులతో మూడు బ్యాచ్‌లకు మెషిన్ ఆపరేటర్, ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ, సీఐపీఈటీ జాయింట్ డైరెక్టర్ సీహెచ్.శేఖర్ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన అధికారులతో పాటు సీఎస్ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్

- డీఎస్పీ శ్రీనివాసులు



సదస్సులో మాట్లాడుతున్న మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసులు

కొత్తూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం వంటిదని అనకాపల్లి మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో శక్తి యాప్, వారియర్స్‌పై బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. శక్తి యాప్ ప్రతి ఒక్కరి వద్ద ఉంటే దాని ద్వారా లైవ్ లొకేషన్ తెలుస్తుందన్నారు. తద్వారా మహిళలపై జరిగే అకృత్యాలను అరికట్టవచ్చునని వివరించారు. ఎస్ఐ రాములమ్మ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తులో జోగేవారికి మంచి, చెడులు తెలియని స్థితిలో చాలా అకృత్యాలకు పాల్పడుతున్నారని వాపోయారు. అటువంటి వారిపట్ల ఆడ పిల్లలు జాగ్రత్త వహించాలన్నారు. ప్రధానంగా విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు, సూపరింటిండెంట్ పి.అనురాధ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ జె.సామ్రాజ్యం, జీఎంఎస్ కార్యదర్శి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో సంస్కరణలతో రాష్ట్రానికి అరుదైన గౌరవం : బుద్ద



తుమ్మపాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విద్యారంగంలో సంస్కరణలను చేపట్టడం ద్వారా రాష్ట్రానికి అరుదైన గౌరవం దక్కిందని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో నిర్వహించే కార్యక్రమానికి మంత్రి లోకేశ్‌కు ఆహ్వానం రావడం ఆనందదాయకమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుదేనని పేర్కొన్నారు.

'ల్యాండ్ పూలింగ్ పేరుతో మోసం'

తుమ్మపాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ల్యాండ్ పూలింగ్ పేరుతో ప్రభుత్వాలు అమాయకుల వద్ద నుంచి భూములను లాక్కొని మోసానికి ఒడిగడుతున్నాయని ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జీసస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీఎస్ అజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం డి.పట్టా ఉన్న వారి నుంచి భూములను లాక్కొని తిరిగి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చ లేదన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఈ కుంభకోణంపై పెద్ద ఎత్తున ప్రచారం చేసి అధికారంలోకి వచ్చాక ముఖం చేటేయడం దారుణమని వాపోయారు. అనకాపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో దాదాపు 1940 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

వివాహిత అదృశ్యంపై కేసు

కశింకోట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. బుచ్చెయ్యపేట మండలం రాజాం గ్రామానికి చెందిన మహిళ గత నెల 11న కశింకోట మండలం నర్సింగబిల్లి వద్ద ఉన్న గ్రామీణ వికాస్ బ్యాంక్‌కు వచ్చిందన్నారు. ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె తండ్రి బుధవారం ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ఇన్‌చార్జి తహశీల్దార్‌గా శాంతిభూషణరావు

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి ఇన్‌చార్జి తహశీల్దార్‌గా శాంతిభూషణరావును నియమిస్తూ బుధవారం కలెక్టర్ విజయకృష్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎంబీ అప్పారావు అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లారు. పరిపాలనా సౌలభ్యం కోసం డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న శాంతిభూషణరావుకు ఇన్ చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు.

నేత్రపర్వంగా వినాయక నవరాత్రి వేడుకలు

- నిదానందొడ్డిలో ఆకట్టుకున్న దీపారాధన



వినాయకుడు, లింగాకారం ఆకారాల్లో వెలిగించిన దీపాలు



అమృతపురంలో స్వామిని దర్శించుకుంటున్న వెంకటేశ్వరరావు, తదితరులు

కొత్తూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వినాయక నవరాత్రి ఉత్సవాలు పలు ప్రాంతాల్లో నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా వీధి వీధినా ప్రతిష్ఠించిన, ఆలయాల్లో కొలువుదీరిన స్వామికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి పట్టణం గవరపాలెం నిదానందొడ్డిలో గణేశ్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద బుధవారం రాత్రి దీపాలంకరణను చేపట్టారు. స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారు, ఓంకారం, శివలింగం, వినాయకుని ఆకారాల్లో దీపాలను పేర్చి వెలిగించారు.

సబ్బవరం : మండలంలోని అసకపల్లి, అమృతపురం, సబ్బవరం అంబేడ్కర్ కాలనీ, గోపాల్‌నగర్ తదితర ప్రాంతాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైసీపీ నేతలు గండి రవికుమార్, బోకం రామునాయుడు, కర్రి బాబు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు శింగంపల్లి శ్రీను, దొడ్డి ప్రకాశ్, కర్రి కనకరాజు, నర్సింగరావు, అప్పారావు, కేవీ సత్యనారాయణ, దెడ్డం ప్రసాద్, యడ్ల నాయుడు, డి.శ్రీను, గవరరాజు, రెడ్డి రామునాయుడు, శేఖర్, జెట్టి ప్రసాద్, వాసు, రవి, బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సరుగుడు పెంపకానికి రైతులు మొగ్గు

- వరి, చెరకు పంటలకు ప్రత్యమ్నాయంగా ఐదు వేల ఎకరాల పైబడి సాగు



లగిశెట్టిపాలెంలో సాగులో ఉన్న సరుగుడు

సబ్బవరం, సెప్టెంబరు 3 : సరుగు సాగుపై ఈ ప్రాంత రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా ఈ ఏడాది సాగు విస్తీర్ణం మరింత పెరిగింది. గతంలో మెట్ట ప్రాంతాలకే పరిమితమైన సరుగుడు సాగు, ఇప్పుడు పల్లపు ప్రాంతాల్లో, చెరువుల కింద కూడా అధికంగా చేపడుతున్నారు. వ్యవసాయ పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోవడం, కూలీల కొరత, వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో పాటు చీడపీడల బెడద, వర్షాలు సకాలంలో కురవక పోవడంతో తదితర కారణాల దృష్ట్యా వరి, చెరకు పంటలకు ప్రత్నామ్నాయంగా సరుగుడు సాగుపై మొగ్గుచూపుతున్నారు.

మండల రైతాంగానికి వరి ప్రధాన పంట. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల నారు మడులు ఎండిపోవడం, మళ్లీ నారు పోసుకోవడం, యంత్రాలతో దమ్ము చేసి నాట్లు వేసిన తరువాత చీడపీడల బెడద, కలుపు బెడద, కలుపు తీసేందుకు కూలీలు దొరక్కపోవడంతో పాటు ఖర్చులు అధికమయ్యాయి. అలాగే, ఒకప్పుడు సబ్బవరం మండలంలో చెరకు సాగుకు ప్రసిద్ధి. క్రమేపీ ఈ పంట వలన లాభం లేకపోవడం, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువవ్వడంతో చెరకు సాగును పూర్తిగా తగ్గించేశారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం వరకు గొటివాడ, ఆరిపాకలలో కాటాలు ఉండేవి. ఇప్పుడు అవి రెండూ మూతపడ్డాయి అంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పెదయాతపాలెం, నల్లరేగులపాలెం గ్రామాల్లోనే అక్కడక్కడ చెరకు వేస్తున్నారు. పెట్టుబడులు పెట్టినా ఆ స్థాయిలో లాభాలు రావడం లేదు. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలైన సరుగుడు, నీలగిరి పెంపకంపై దృష్టిసారిస్తున్నారు.

అంతకాపల్లి, అయ్యన్నపాలెం, ఆరిపాక, టెక్కలిపాలెం, వంగలి, బంగారమ్మపాలెం, మలునాయుడుపాలెం, అసకపల్లి, బాటజంగాలపాలెం, నారపాడు తదితర గ్రామాల్లో అధిక మొత్తంలో రైతులు సరుగుడు సాగువైపు మొగ్గు చూపుతున్నారు. అయ్యన్నపాలెం భూదేవి చెరువు, ఆరిపాక వెంకట్రావు చెరువు, ఆదిరెడ్డిపాలెం పోతురాజు చెరువు, అమృతపురం రాజ్ చెరువు, అసకపల్లి సంగడాల చెరువుల కింద సైతం సరుగుడు సాగును చేపడతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సుమారు ఐదు వేల ఎకరాల్లో సరుగుడు, సుమారు ఐదు వందల ఎకరాల్లో నీలగిరి సాగులో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

ఒకేసారి పెద్ద మొత్తంలో ఆదాయం

సరుగుడు సాగుకయ్యే ఖర్చు తక్కువగా ఉండడంతో రైతులు ఈ దిశగా మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తుంది. గత కొన్నేళ్లుగా సరుగుడ ధర కూడా ఆశాజనకంగా ఉండడం రైతాంగం ఈ సాగువైపు ఆసక్తి చూపుతున్నారు. ఒకసారి ఉడిస్తే నాలుగైదేళ్ల ఎటువంటి పెట్టుబడి లేకుండా



సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెం పోతురాజు చెరువు కింద...



ఆరిపాక రెవెన్యూ పరిధి వెంకట్రాజు చెరువు కింద...

ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బులు వస్తుండడంతో రైతులు ఈ పంట సాగుకే ఇష్టపడుతున్నారని అంటున్నారు. ఎకరా విస్తీర్ణంలో సరుగుడు సాగు చేస్తే నాట్లు వేసిన దగ్గర నుంచి కలుపు తియ్యడం, ఎండలు విపరీతంగా ఉంటే నీటి తడులు పెట్టడం చేస్తుంటారు. మొదటి ఏడాది గరిష్ఠంగా రూ.30 నుంచి రూ.35 వేలు ఖర్చు అవుతుంది. నాలుగు నుంచి ఐదేళ్ల మధ్య చెట్లు కోతకు వస్తాయి. ఎకరాకు ఐదేళ్లకు 40 నుంచి 50 టన్నులు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఏడాది క్రితం వరకూ టన్ను సరుగుడు ధర రూ.8,500 నుంచి రూ. తొమ్మిది వేలు వరకూ ఉండేది. ఇప్పుడు టన్ను రూ. ఏడు వేలు లెక్కన వస్తుంది. ఈ లెక్కన ఎకరా సరుగుడుకి కనిష్ఠంగా రూ.60 వేలు నుంచి రూ. 65 వేలు వస్తుందని రైతులు చెబుతున్నారు. ఒకేసారి పెద్ద మొత్తంలో ఆదాయం కనిస్తుండడంతో రైతులు సరుగుడు సాగువైపు మొగ్గు చూపిస్తున్నారు.

14 ఎకరాల్లో సరుగుడు సాగు చేస్తున్నాను



ఏడాది క్రితం వరకూ నాలుగు ఎకరాల్లో కౌలుకు వరి సాగు చేసే వాడిని. ఎకరాకు రూ. 20 నుంచి రూ.25 వేల వరకు ఆదాయం వచ్చేది. చీడపీడలు, వర్షాభావ పరిస్థితులు కన్నా కూలీలు ఇబ్బంది అధికంగా ఉండేది. మా అన్నదములతో కలిసి కరోనా సమయం 2021లో పది ఎకరాల్లో కౌలుకు సరుగుడు వేశాను. ఈ ఏడాది జనవరిలో కోసి విక్రయించగా ఆశించిన మేరకు ఫలితం దక్కింది. అందుకే ఈ ఏడాది వరి మానేసి మొత్తంగా 14 ఎకరాల్లో కౌలుకు సరుగుడు వేశాను.

\- గొర్లి దేముడుబాబు, లగిశెట్టిపాలెం, సబ్బవరం

అద్దరవీధి కల్వర్టు వద్ద కాంక్రీట్ పనులు ప్రారంభం

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



కల్వర్టు వద్ద మెటల్‌వేసి చదును చేస్తున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం అద్దరవీధి కల్వర్టు వద్ద కాంక్రీట్ పనులను ప్రారంభించారు. అద్దరవీధి కల్వర్టు వద్ద తూరాలు ఏర్పాటుచేసి మట్టితో పూడ్చివేయడం వల్ల బురదమయమైపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు ప్రయాణికులు అవస్థలుపడుతున్నారు. వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. ఈ సమస్యలను వివరిస్తూ సెప్టెంబరు ఒకటోతేదీన 'అద్దరవీధి బురదలో కూరుకుపోయిన వ్యాన్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. ఎస్ఎంఐ ఇంజనీరింగ్ అధికారులు స్పందించారు. కల్వర్టు వద్ద కాంక్రీట్ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. ఈమేరకు కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు బుధవారం మెటల్ పంపించారు. కొత్తపాలెం, మండపల్లి గ్రామానికి చెందిన 30మంది గిరిజనులు శ్రమదానం చేసి బురదమయమైపోయిన కల్వర్టు వద్ద మెటల్ వేసి రహదారి చదును చేశారు. శ్రమదానం చేసిన గిరిజనులకు కోఆప్టెడ్ సభ్యుడు ఎస్కే దావీదు భోజనాలు ఏర్పాటు చేశారు. రెండు రోజుల్లో కాంక్రీట్ పనులు పూర్తి చేస్తామని ఎస్ఎంఐ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

వడ్డాది స్కూల్ ఘటనపై డిప్యూటీ డీఈవో విచారణ

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాది ఉన్నత పాఠశాలలో అనధికార వ్యక్తి తిష్ఠ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై డిప్యూటీ డీఈవో అప్పారావు బుధవారం విచారణ చేపట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఇప్పటి వరకు పూర్వ హెచ్ఎం శేషుబాబు, చార్జి ఇవ్వకపోవడంపై విచారణ చేస్తామని ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో చెప్పారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని టీడీపీ వడ్డాది అధ్యక్షుడు దొండా నరేశ్ కోరారు. అన్ని విషయాలపైనా విచారణ చేసి డీఈవోకు నివేదిక సమర్పిస్తానని డిప్యూటీ డీఈవో చెప్పారు. ఎంఈవో-2 బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ కోవెల వెంకటరమణ పాల్గొన్నారు.

'మూడు రోజుల్లో మట్టి తొలగిస్తాం'

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

చీడికాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మదుమునకు అడ్డంగా ఉన్న మట్టిని మూడు రోజుల్లో తొలగిస్తామని ఉపాధి పథకం ఏపీవో అల్లు గంగునాయుడు తెలిపారు. 'ఉపాధి ఉద్యోగుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి స్పందించారు. ఇప్పటికే మట్టి తొలగింపు పనులు ప్రారంభించామని చెప్పారు. పొలాల్లోని నీరు బయటకు పోయేలా చూస్తామని తెలిపారు.

యూరియా కొరత లేదు: ఏడీఏ శ్రీదేవి

నర్సీపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంటల విస్తీర్ణానికి సరిపడా ఎరువులు ఉన్నాయని వ్యవసాయ శాఖ ఏడీ శ్రీదేవి తెలిపారు. డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 10765 హెక్టార్లలో వరి, 940 హెక్టార్లలో చెరుకు నాట్లు వేశారన్నారు. డివిజన్‌లో ఎక్కడా యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం 166 టన్నుల యూరియా అందుబాటులో ఉందని వెల్లడించారు. ఎరువులు బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ అధికారుల సిఫారసు మేరకు రైతులు అవసరమైన మోతాదులో ఎరువులు వాడుకోవాలని ఆమె సూచించారు.

నెలాఖరు వరకు ఈ- క్రాప్ నమోదు

కొయ్యూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే ఉద్యాన, ఇతర వ్యవసాయ పంటల వివరాలను ఈ నెలాఖరులోగా సమీప రైతు సేవా కేంద్రాలలో ఈ- క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి ప్రియాంక సూచించారు. ఈ నమోదుతో ప్రభుత్వం తరఫునవచ్చే పథకాలు, అన్నదాత సుఖీభవ, ధాన్యం కొనుగోలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపరిహారం, రాయితీలు వర్తిస్తాయన్నారు.

కబడ్డీలో సెమీ ఫైనల్స్‌కు ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జట్టు

సీలేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 47వ జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ఆంధ్ర ప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జట్టు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నట్టు ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జట్టు మేనేజర్ సీహెచ్ సురేశ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం యాదాద్రిగుట్టలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో బుధవారం ఆంధ్రప్రదేశ్ జట్టు, ఉత్తరప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జట్లు తలపడ్డాయి. ఆంధ్రప్రదేశ్ జట్టు (35 పాయింట్ల తేడాతో) గెలుపొంది సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. జట్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న సీలేరుకు చెందిన కె. శ్రీనివాసులు, సీలేరుకు చెందిన మరో క్రీడాకారుడు కె.శ్రీనివాస్ బెస్ట్ డిఫెన్సర్‌గా తమ ప్రతిభను కనబరచడంతో ఆంధ్రప్రదేశ్ జట్టు సెమీస్‌కు చేరినట్టు జట్టు మేనేజర్ సీహెచ్ సురేశ్ చెప్పారు.

అన్నసమారాధన

సీలేరు, సెప్టెంబరు 3 , (ఆంధ్రజ్యోతి) : సీలేరులో బుధవారం స్థానిక శివాలయం వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుని సన్నిధిలో భారీ అన్న సమారాధనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. అలాగే అల్లూరివీధిలో వినాక మండపం వద్ద బుధవారం సాయంత్రం సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దు చేసే వరకు పోరాటం

» బస్కీలో సర్వే రాళ్లను ధ్వంసం చేసిన గిరిజనులు

అరకులోయ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హైడ్రో పవర్‌ప్రాజెక్టు అనుమతులను రద్దు చేసేంతవరకు నిరసన కార్యక్రమాలు ఆపేది లేదని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు బాలదేవ్, అరకులోయ వైస్ ఎంపీపీ కిల్లో రామన్న , బస్కీ సర్పంచ్ పాడి రమేశ్ స్పష్టంచేశారు. బుధవారం బస్కీ పరిసర ప్రాంతాల్లో హైడ్రోపవర్ ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే దిమ్మలను గిరిజనుల సంప్రదాయ పనిముట్లతో ధ్వంసం చేసి నిరసన వ్యక్తంచేశారు. ఇటీవల లోతేరు పరిధి దూడ్ కొండి, బూర్జ పంచాయతీ మజ్జివలస, భస్కీ పరిసర ప్రాంతాల్లో హైడ్రో పవర్‌ప్రాజెక్టులకు సంబంధించిన సర్వే దిమ్మలు పాతారు. ఈ నేపథ్యంలో బస్కీ ఎంపీటీసీ సభ్యుడు, వైస్ ఎంపీపీ ఆదివాసీ గిరిజన



బస్కీలో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘం, సర్పంచ్, నాయకులు



గ్రామ పరిసరాల్లో సర్వే రాళ్లను ధ్వంసం చేస్తున్న గిరిజనులు

సంఘం, పంచాయితీ గిరిజనం నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం హైడ్రోపవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఇచ్చిన 51వ జీవోను తక్షణం రద్దు చేయాలన్నారు. నవయుగ, ఆదానీ కంపెనీలకు హైడ్రోపవర్ ప్రాజెక్టులు కట్టబెట్టి గిరిజనుల బతుకులను ఛిద్రం చేసేందుకు చర్యలు తీసుకోవడం తగదన్నారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా బడా పారిశ్రామికవేత్తలకు తమ బతుకులను వీధి పాలు చేసే అధికారం ఎవరిచ్చారని ధ్వజమెత్తారు. ఈ ప్రాజెక్టులవల్ల గిరిజనులు సాగుచేసుకునే వ్యవసాయం, కాఫీతోటలు, పంటపొలాలు నీటి పాలవతాయన్నారు. ఇంతగా నష్టం వాటిల్లే ప్రాజెక్టుల విషయంలో చూస్తూఊరుకునేది లేదని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనల సంరక్షణ చట్టాలు,హక్కులను కాలరాస్తే ప్రతిఘటిస్తామన్నారు. ఇకనైనా స్పందించి ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ప్రతినిధులతో పాటు గిరిజన సంఘం నేతలు రామారావు తదితరులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీఐకు సన్మానం



బదిలీపై వెళుతున్న సీఐకు వీడ్కోలు పలుకుతున్న సిబ్బంది

కొయ్యూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు సీఐగా రెండున్నరేళ్లలో పనిచేసిన వెంకటరమణ గంజాయి రవాణా నిరోధం, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేసినట్టు పలువరు వక్తలు కొనియాడారు. బదిలీపై వెళుతున్న సీఐ వెంకటరమణ వీడ్కోలు సభను బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొయ్యూరు, మంప ఎస్ఐలు కిశోర్‌వర్మ, శంకరరావు ఆయనను సత్కరించి జ్ఞాపికను అందచేశారు. అనంతరం పలువురు నాయకులు, ప్రజలు, వ్యాపారులు, పాత్రికేయులు తదితరులు సీఐను సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. టీడీపీ నేత ఎంవీవీ ప్రసాద్, జడ్పీటీసీ సభ్యుడు వారానూకరాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రహదారికి మరమ్మతులు

కొయ్యూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాడి గ్రామస్థులు శ్రమదానంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఛిద్రమైన రహదారితోపాటు వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరించారు. వివరాలివి.. రత్నంపేట నుంచి పాడి మీదుగా కన్నంపేట వెళ్లే ప్రధాన రహదారి అల్పపీడన ప్రభావంతో గత వారంలో కురిసిన వర్షాలకు పూర్తిగా కోతకు గురైంది. పాడి గ్రామ సమీప కొండవాగుపై వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే సుమారు ఆరు గ్రామాలతో పాటు పాడి గ్రామస్థులు సమస్య నెదుర్కొంటున్నారు. దీంతో స్పందించిన పాడి గ్రామస్థులు శ్రమదానంతో కొట్టుకుపోయిన వంతెనపై కాంక్రీట్‌తో సరిచేయటంతో పాటు మట్టితో రాకపోకలకు అంతరాయం లేకుండా మరమ్మతు పనులు చేపట్టారు. ఈ రోడ్డులో గోతులు, కోతకు గురైన ప్రదేశాల్లో మరమ్మతులు చేపట్టి రవాణాకు అంతరాయం లేకుండా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రధానంగా గ్రామం ముందు కొండవాగుపై వంతెన నిర్మాణాలను సత్వరం పూర్తి చేసేలా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలన్నారు. మరోసారి విస్తృతంగా వర్షాలు కురిస్తే ఉన్న కొద్దిపాటి వంతెన తెగిపోయి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే పరిస్థితులు నెలకొంటాయని ఆందోళన వ్యక్తంచేశారు.

కాలం చెల్లిన బాలామృతం సరఫరా



కాలం చెల్లిన ప్యాకెట్ చూపుతున్న మహిళ

సీలేరు, సెప్టెంబరు 3 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని అన్నవరం మినీ అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు కాలం చెల్లిన బాలామృతం ప్యాకెట్లను పంపిణీ చేసినట్టు గుమ్మిరేవుల మాజీ సర్పంచ్ పూజారి బాబూరావు ఆరోపించారు. బుధవారం ఆయన అన్నవరంలో పంపిణీ చేసిన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలోని మాదిమళ్ల అంగన్‌వాడీ సెంటర్ నుంచి అన్నవరంఅంగన్‌వాడీ సెంటర్‌కు బాలామృతం పౌష్టికాహార ప్యాకెట్లను సరఫరా చేశారన్నారు. తీరా అవి చూస్తే కాలం చెల్లినవని, ఇలాంటి సరకులు పిల్లలకు పెడితే వారికి వికటించి ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందనిఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఐసీడీఎస్ అధికారులు తక్షణమే స్పందించి దీనిపై విచారణ జరిపించి వాటి స్థానంలో కొత్త బాలామృతం సరకులు సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

యూరియా కోసం తోపులాట



యూరియా కోసం గుమిగూడిన రైతులు

దేవరాపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో యూరియా కోసం తోపులాట జరిగింది. పరిసర గ్రామాల నుంచి రైతులు తరలివచ్చి బారులు తీరారు. అయితే 1బీ కాపీ, ఆధార్ జెరాక్సు తీసుకు రావాలని వ్యవసాయ అధికారులు తెలపడంతో రైతులు పరుగులు పెట్టారు. ఒక్క రైతుకు ఒకటే బస్తా ఇవ్వడంతో క్యూలైన్‌లో తోపులాట జరిగింది. పోలీసుల జోక్యంతో సమస్య పరిష్కారమైంది. పోలీసుల సహకారంతో వ్యవసాయ శాఖ అధికారులు యూరియా సక్రమంగా పంపిణీ చేశారు. యూరియా కోసం గ్రామాల్లో పేర్లు నమోదు చేసుకుంటే ఇస్తామని ఏవో కాంతమ్మ తెలిపారు.

అనారోగ్యంతో జీసీసీ ఉద్యోగి గోవిందరావు మృతి

చింతపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ కొయ్యూరు బ్రాంచి పరిధిలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సంపరి గోవిందరావు అనారోగ్యంతో మృతి చెందారు. జూనియర్ అసిస్టెంట్ గోవిందరావు ప్రస్తుతం కాకరపాడు పెట్రోల్ బంక్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. ఆయన కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆయన కుటుంబంతో చింతపల్లి మండల కేంద్రం ఆయన నివాసంలో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి తుది శ్వాస విడిచాడు. ఆయనకు భార్య ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న చింతపల్లి డివిజనల్ మేనేజర్ బుక్కా వెంకటేశ్, కొయ్యూరు బ్రాంచి మేనేజర్ సరమండ విజయ కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సాయంగా రూ.25వేల నగదును అందజేశారు. ఆయన అంత్య క్రియల్లో జీసీసీ కొయ్యూరు బ్రాంచి అకౌంటెంట్ గసాడి మల్లేశ్వరరావు, చింతపల్లి బ్రాంచి మేనేజర్ చల్లంగి సుగునాథం, గ్యాస్ ఇన్‌చార్జి ఎల్. రమణమూర్తి, ఎంఎల్ఎస్ ఇన్‌చార్జి ఎంవీ రమణమూర్తి, జీసీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



గోవిందరావు (ఫైల్‌ఫొటో)

ఆటో కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి: సీఐటీయూ

పాడేరురూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి లింగేటి సుందరరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పాడేరు ఆటో కార్మికులు బుధవారం పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణ పథకం అమలు చేయడంతో కార్మికులు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. ఈ స్థితిలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. దీనికితోడు వాహనదారులపై జరిమానాలను విపరీతంగా పెంచారన్నారు. ప్రైవేటు ఫైనాన్స్ వడ్డీలు కట్టుకోలేక కొంత మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆటో కార్మికులకు ఏడాదికి వాహన మిత్ర కింద రూ.25 వేలు భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆటో కొనుగోలుకు బ్యాంక్ రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఆటో కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు కృష్ణారావు, అధ్యక్షుడు జె.సంజీవరావు, కార్యదర్శి ప్రసాద్, సుందరరావు, వెంకటరావు, బాలు, సురేష్, కిరణ్, అనిల్, సాయి, దాసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో ర్యాలీ చేపట్టిన ఆటో కార్మికులు

గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణకు చర్యలు

» మండల సమావేశంలో ఎంపీపీ రమేశ్‌బాబు

కొయ్యూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యమివ్వాలని పంచాయతీ కార్యదర్శులు, వైద్యశాఖ సిబ్బందికి స్థానిక ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వీడీకే ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో సభ్యులు సమావేశం దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలు వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యలను ముందుగా అధికారులు వివరించారు. అనంతరం అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరును ఎంపీడీవో సమావేశంలో వెల్లడించారు. ఎంపీపీ మాట్లాడుతూ అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు జరిగిన నష్టాలను పంచాయతీల వారీగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండడంలేదని వస్తున్న ఫిర్యాదులపై ఏవో ప్రియాంకను ఆయన ప్రశ్నించారు. ఏవో మాట్లాడుతూ, ఎరువులు రైతులకు అందరికీ అందుబాటులో ఉండేలా చూస్తానని, సిబ్బంది కొరతతో సమస్య నెలకొందని వివరణ ఇచ్చారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఈ సందర్భంగా ఎంపీపీ అధికారులకు సూచించారు. అనంతరం అధికారులు శాఖల వారీ ప్రగతిని సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, ఎంపీటీసీలు, 33 పంచాయతీల సర్పంచ్‌లు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమేశ్‌బాబు

కోటబంధలో రక్షిత పథకం ప్రారంభం

చింతపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం పంచాయతీ కోటబంద గ్రామంలో రూ.3.5 లక్షలతో నిర్మించిన తాగు నీటి పథకం నిర్మిచ వైస్ ఎంపీపీ గోపీనాయక్ శారద, సర్పంచ్ వనగల సోమరత్నం బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గిరిజనులు మంచి నీటి కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనేవారన్నారు. ఈమేరకు 15వ ఆర్థిక సంఘం నిధులతో రక్షిత మంచి నీటి పథకం నిర్మించినట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో వైసీపీ మండల కార్యదర్శి బెన్నిబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.



కుళాయిలను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ శారద, సర్పంచ్

నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల వార్తలు...

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

రావికమతం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావికమతం, కొత్తకోట ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్ఐ డి.రవికుమార్ ఆధ్వర్యంలో ఈ సోదాలు జరిగాయి. దుకాణాల్లో ఉన్న ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా యూరియా నిల్వలు ఉన్నది? లేనిది? తనిఖీ చేశారు. నిర్దేశిత ధరలకు మించి ఎరువులు అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తామని ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్ఐ రవికుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమేశ్, విజిలెన్స్ సిబ్బంది బి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ మత్స్యకారుల అభివృద్ధికి కృషి

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కాలువలపై ఆధారపడే మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. రొంగలినాయుడుపాలెంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువుల్లో పెంచుకుంటున్న చేపలను దళారులకు ఇవ్వకుండా నేరుగా అమ్ముకోవాలని సూచించారు. గ్రామాల్లో చేపల విక్రయానికి మార్కెట్ సదుపాయం లేకపోతే విశాఖనగరంలో అమ్ముకునేలా మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతానన్నారు. ప్రతీ మత్స్యకారునికి మోపెడ్, ఐస్‌బాక్స్, వాహనాలు, కోల్డ్ స్టోరేజీలు అందిస్తామన్నారు. అంతకుముందు శ్రీరామ స్వదేశీ మత్స్యకార సహకార సంఘానికి యాజమాన్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.2.54 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బేరా శ్రీను, బేరా రాములు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార అభివృద్ధి అధికారిణి టి.నాగమణి, తహశీల్దార్ భుజంగరావు, ఎంపీడీవో సాంబశివరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేశ్, నాయకులు జూరెడ్డి రాము, ఎస్.రామునాయుడు, డి.నరసింహమూర్తి, పి.నారాయణమూర్తి, బి.నరసింహనాయుడు, కె.సూర్యనారాయణ, వి.పైడమునాయుడు, అక్కునాయుడు, పి.శ్రీను, స్వామినాథం, అప్పలనాయుడు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



వేంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పాలక మండలి చైర్మన్‌గా టి.బ్రహ్మలింగస్వామి, సభ్యులుగా పి.ఉదయ్ శివకుమార్, బి.లక్ష్మి, ఎం.సుజాత, వి.జగదీశ్వరి, కె.వరలక్ష్మి, ఆర్.వెంకటరమణ, ఎ.వాసురాజు, ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా టి.శరత్‌తో ఈవో సాంబశివరావు ప్రమాణ స్వీకారం చేయించారు. 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ సభ్యులకు కండువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో దేవదాయ జిల్లా మేనేజర్ ఉమాదేవి, ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రావికమతం రోడ్డులో ట్రాఫిక్ జామ్



గుమ్మాళ్లపాడు-రావికమతం రోడ్డులో భారీగా నిలిచిపోయిన వాహనాలు

రావికమతం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక లోపంతో రోడ్డు మధ్యలో వాహనం నిలిచిపోవడంతో గుమ్మాళ్ళపాడు-రావికమతం మార్గంలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సుమారు గంట పాటు వాహనాలు చాంతాడులా నిలిచిపోయాయి. దీంతో రావికమతం నుంచి కింతలి వైపు, చినపాచిల నుంచి రావికమతం రాకపోకలు సాగించే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వాహన డ్రైవర్ రావికమతం నుంచి మెకానిక్‌ను తీసుకొచ్చి సాంకేతిక లోపం సరి చేసి రోడ్డు నుంచి పక్కకు తీయడంతో ట్రాఫిక్ సమస్య తొలగింది.

ఏఎల్ పురంలో సీసీ రోడ్డు, విద్యుత్ లైన్ పనులు



ఏఎల్ పురంలో విద్యుత్ లైన్లు సరిచేస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలోని ఎస్సీ కాలనీలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా చేపడుతున్నారు. అలాగే ఎస్సీ కాలనీలో ఇళ్లపై ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు ఉన్నాయని, ఏళ్ల తరబడి సీసీ రోడ్డుకు నోచుకోలేదని స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఎంపీపీ గజ్జలపు మణికుమారి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, రూ.86 వేలతో విద్యుత్ వైర్ల తొలగింపు పనులు చేపడుతున్నారు. ఈపీడీసీఎల్ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో వైర్లు తొలగించి పక్కనున్న 33 కేవీ విద్యుత్ స్తంభాలకు అమర్చారు. అలాగే సీసీ రోడ్డు పనులను ఎంపీపీ మణికుమారి ప్రారంభించారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీటీసీ సభ్యుడు బుల్లిప్రసాద్ పాల్గొన్నారు.

కల్వర్టు పునరుద్ధరణ పనులు ప్రారంభం



దాసరయ్యపాలెంలో కల్వర్టు నిర్మిస్తున్న దృశ్యం

రావికమతం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి మరుపాక వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో దాసరయ్యపాలెం వద్ద కూలిపోయిన కల్వర్టు పునరుద్ధరణ పనులను ఆర్అండ్‌బీ అధికారులు బుధవారం ప్రారంభించారు. రాయి తరలించే భారీ క్వారీ లారీల రాకపోకల వల్ల ఐదు నెలల క్రితం దాసరయ్యపాలెం వద్ద కల్వర్టు కూలిపోయింది. దీంతో మరుపాక మోడల్ స్కూల్‌కు విద్యార్థులతో రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సుల సర్వీసులు నిలిచిపోయాయి. ఫలితంగా దూర ప్రాంతాల నుంచి మోడల్ స్కూల్‌కు వచ్చి, వెళ్లే విద్యార్థులు, గ్రామస్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా మోడల్ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు, మరుపాక గ్రామస్థుల విజ్ఞప్తుల మేరకు ఆర్అండ్‌బీ శాఖ నుంచి రూ.6 లక్షల మంజూరు చేయడంతో పనులు చేపడుతున్నారు.




624 మెట్రిక్ టన్నుల యూరియాకు ప్రతిపాదన: ఏడీఏ

చోడవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ పరిధిలో 624 మెట్రిక్ టన్నుల యూరియాకు ప్రతిపాదన పంపించామని వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్రనాథ్ తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఐదు మండలాల్లోని రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా వీటిని రైతులకు విక్రయించేందుకు ఇండెంట్ పంపించామన్నారు. చోడవరం మండలానికి 144 మెట్రిక్ టన్నులు, చీడికాడ మండలానికి 96, బుచ్చెయ్యపేట మండలానికి 108, కె.కోటపాడు మండలానికి 204, దేవరాపల్లి మండలానికి 72 మెట్రిక్ టన్నులు అవసరమని ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. ఈ నివేదిక మేరకు రైతులకు యూరియా రైతులకు అందుతుందని, ఎవరూఆందోళన చెందనవసరం లేదని ఏడీ రవీంద్రనాథ్ వివరించారు.



విజిలెన్స్ తనిఖీలు

నర్సీపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎరువుల దుకాణంలో బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. స్థానిక హోల్‌సేల్ దుకాణంలో నిల్వలు పరిశీలించారు. రికార్డుల ప్రకారం ఎరువులు సక్రమంగా ఉన్నట్టు గుర్తించామని విజిలెన్స్ ఏవో నాయక్, ఏవో విజయలక్ష్మి తెలిపారు.



సీతారాముల కల్యాణం


చోడవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీ ఎస్‌పేట లక్ష్మీ గణపతి ఆలయంలో బుధవారం సీతారాముల కళ్యాణవేడుకలు ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా బుధవారం ఆలయ చైర్మన్ పుట్రేవు శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు సూర్య గోపాలాచార్యులు, గోవిందాచార్యులు, నరసింహాచార్యులు పుణ్య దంపతులతో సీతారాముల కళ్యాణంతో పాటు పల్లకీ ఉత్సవం. ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీగా భక్తులు పాల్గొన్నారు.





క్రీడా సామగ్రి అందజేత

మాకవరపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ లాలం మాధవి, రాము దంపతులు క్రీడా సామగ్రి అందజేశారు. హెచ్‌ఎం నారాయణరావుకు బుధవారం వీటిని అందించారు. చైర్‌పర్సన్‌గా తాను కొంత సాయం చేయాలనే ఉద్దేశ్యంతోనే పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేసినట్టు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు రవి పాల్గొన్నారు.







సాయి కుటుంబానికి ఆర్థిక సాయం

నాతవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంబీపట్నం గ్రామానికి చెందిన అనపర్తి సాయి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, ఆయన కుటుంబానికి అఖండ సేవా సంస్థాన్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందించారు. రూ.27 వేల సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు బోళెం శివ. సంస్థ సభ్యులు రఘు, దయాకర్ చైతన్య, సురేశ్ పాల్గొన్నారు.





వివాహిత అదృశ్యంపై కేసు

కశింకోట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు. బుచ్చెయ్యపేట మండలం రాజాం గ్రామానికి చెందిన మహిళ గత నెల 11న కశింకోట మండలం నర్సింగబిల్లి వద్ద ఉన్న గ్రామీణ వికాస్ బ్యాంక్‌కు వచ్చిందన్నారు. ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె తండ్రి బుధవారం ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.





తెలుగు యువత మండల అధ్యక్షుడిగా రమేశ్

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వడ్డాదికి చెందిన సింగంపల్లి రమేశ్ తెలుగు యవత మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రమేశ్ మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. గతంలో టౌన్ అధ్యక్షుడిగా పని చేశారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే రాజుకు, విశాఖ డెయిరీ డైరెక్టర్ సత్యనారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



మెగా జాబ్‌మేళా

నర్సీపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవిద్య కళాశాలలో హెట్రో ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులతో పాటు బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన 100 మంది పేర్లు నమోదు చేయించుకోగా వారిలో 53 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ గాడి సత్యవతి, డైరెక్టర్ దొర బాబు, ప్రిన్సిపాల్ నానాజి, తదితరులు పాల్గొన్నారు.





























దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం
సంయుక్త స్నాతకోత్సవం రేపు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త స్నాతకోత్సవాన్ని (8, 9, 10, 11, 12వ స్నాతకోత్సవాలు) ఈ నెల ఐదో తేదీన నిర్వహించనున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు వెల్లడించారు. బుధవారం డాబాగార్డెన్స్‌లోని ఒక హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు బీచ్‌రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో సాత్నకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నరసింహ గౌరవ అతిథిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మహేశ్వరి విశిష్ట అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ విశిష్ట అతిథిగా హాజరవుతారన్నారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, డీఎస్ఎన్ఎల్‌యూ గౌరవ చాన్సలర్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహిస్తారన్నారు. అదేవిధంగా డీఎస్ఎన్ఎల్‌యూలో నూతనంగా నిర్మించిన అకడమిక్ బ్లాక్, ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇతర భవనాలను ఐదో తేదీ సాయంత్రం 4.30 గంటలకు అతిథుల చేతులు మీదుగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. ప్రముఖుల విగ్రహాల ఆవిష్కరణ ఉంటుందన్నారు.


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు

ఉత్తమ గురువులు

... 5వ పేజీ తరువాయి

సత్తాచాటుతున్నారు. పవర్ లిఫ్టింగ్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో వంటి క్రీడల్లో జిల్లాస్థాయి నుంచి ప్రపంచస్థాయి వరకు అవార్డులు సొంతం చేసుకున్నారు. నాగజ్యోతి భర్త సర్వేశ్వరరావు వ్యాపారి. వీరి ఏకైక కుమార్తె సాహితి ప్రస్తుతం బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన సందర్భంగా ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత బాధ్యత పెంచిందన్నారు.

అవార్డు విద్యార్థులకు అంకితం: డీజీ నాథ్

నర్సీపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అవార్డు విద్యార్థులకు అంకితం ఇస్తున్నట్టు నర్సీపట్నం శివరపురంలోని మోడల్ ప్రైమరీ స్కూల్ టీచర్ డీజీ నాథ్ తెలిపారు. ఆయన బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, ఉపాధ్యాయవృత్తిలోకి వచ్చి రెండున్నర దశాబ్దాలు దాటిందని, ఏ స్కూల్లో పని చేసినా విద్యార్థుల ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా విధులు నిర్వర్తించానని చెప్పారు. కాగా బీఎస్సీ, బీఈడీ పూర్తిచేసి డీజీ నాథ్.. 1998 డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికయ్యారు. కొయ్యూరు మండలం లొద్దిపాకలు పాఠశాల టీచర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. తరువాత గొలుగొండ మండలం జమ్మవరం, నర్సీపట్నం మండలం బలిఘట్టం, వెంకునాయుడుపేట పాఠశాలల్లో పనిచేశారు. ప్రస్తుతం శివపురం మోడల్ స్కూల్లో ఎస్‌జీటీగా పనిచేస్తున్నారు. ఉద్యోగంలో చేరిన తొలి ఏడాదే పీఆర్టీయూ కొయ్యూరు మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2003లో పీఆర్టీయూ జిల్లా కార్యదర్శిగా, 2005 నుంచి అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా 20 సంవత్సరాల నుంచి సేవలు అందిస్తున్నారు. 2018లో ఉత్తమ సేవా అవార్డును అప్పటి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు.

వారాడకు వన్నె తెచ్చిన 'లెక్కల'.

కె.కోటపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన లెక్కల వెంకట నారాయణరావు మూడు దశాబ్దాలుగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. కె.కోటపాడు మండలం వారాడలో జన్మించిన వెంకట నారాయణరావు ప్రాథమిక విద్యను స్వగ్రామంలో, హైస్కూల్ విద్యను ఎ.కోడూరులో పూర్తిచేశారు. ఇంటర్, డిగ్రీ అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో, ఎమ్మెస్సీ ఏయూలో, బీఈడీ విజయనగరంలో పూర్తి చేశారు. డీఎస్సీ-1995 ద్వారా టీచర్ పోస్టుకు ఎంపికైన ఆయన కె.కోటపాడు మండలం రొంగలనాయుడుపాలెం పాఠశాల ఉపాధ్యాయునిగా తొలి పోస్టింగు. తరువాత 1998 నుంచి 2009 వరకు ఇదే మండలం రామచంద్రపురం, 2009-15 మధ్య దేవరాపల్లి మండలం వేచలం, 2015-22 మధ్య గాజువాక హైస్కూల్‌లో, 2022 నుంచి ఇప్పటి వరకు కె.కోటపాడు మండలం గొండుపాలెం పాఠశాల ఎస్ఏగా పనిచేస్తున్నారు. 2006లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. గ్రామీణ పేద విద్యార్థుల్లో ప్రతిభ కలిగిన వారిని గుర్తించి సిరి ఫౌండేషన్ సహకారంతో ఇప్పటి వరకు 99 మంది ఉన్నత విద్యకు తోడ్పాటు అందించారు.

ఆర్ఈసీఎస్ ఉద్యోగులకు ఝలక్

... 5వ పేజీ తరువాయి

జరిగాయి. ఈ నేపథ్యంలో తీర్పు వచ్చేంత వరకు ఉద్యోగులకు పాత జీతాలనే ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. దాంతో ఈపీడీసీఎల్ అధికారులు పీఆర్సీ ఇవ్వడానికి ముందు అంటే 2025 మే నెలకు ముందు ఏ జీతాలు ఇచ్చారో వాటినే సెప్టెంబరు 1, 2 తేదీలతో ఉద్యోగుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు.

స్నేహానికి ప్రతీక బలి ఉత్సవం

మాడగడలో బ్రిటీష్ కాలం నుంచి కొనసాగుతున్న ఆచారం

- వరుసగా మూడేళ్లు పండుగ చేస్తే ఆ తరువాత మూడేళ్లు బ్రేక్
- 12 రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ వేడుక ఈ నెల 5తో ముగింపు
- ఆఖరి రోజు హాజరుకానున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- తరతరాలు స్నేహం కొనసాగాలనుకునే వారు పాల్గొనే అరుదైన పండుగ


మాడగడలో బలి ఉత్సవం సందర్భంగా మహిళా పూజారుల సమక్షంలో 12 మంది అక్కాచెల్లెళ్లతో పూజలు చేయిస్తున్న దృశ్యం

అరకులోయ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాడగడ గ్రామంలో గిరిజనులు నిర్వహించే అరుదైన పండుగ గత నెల 25న ప్రారంభమైంది. బలి ఉత్సవంగా పిలిచే ఈ పండుగ 12 రోజుల పాటు నిర్వహిస్తారు. గిరిజనుల ఆహ్వానం మేరకు ఆఖరి రోజైన ఈ నెల 5వ తేదీన జరిగే వేడుకకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరుకానున్నారు. దీంతో ఈ పండుగపై అందరిలో ఆసక్తి పెరిగింది. ఈ పండుగ విశిష్టతను తెలుసుకోవాలనే ఉత్సాహం అందరిలో నెలకొంది. స్నేహానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ బ్రిటీష్ కాలంలో ఈ గ్రామంలో మొదలైంది.

బలి ఉత్సవం ప్రాముఖ్యత

మాడగడ ముఠా పరిధిలో ఉన్న ప్రజలంతా పాడి పంటలు, పశుసంపద, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ ప్రత్యేకంగా పూజలు చేస్తారు. అంతేకాకుండా ఎవరితోనైనా స్నేహం కోరుకునేవారు చివరి రోజున జరిగే కార్యక్రమంలో బలిపుష్పాలను ఒకరి చెవిలో మరొకరు పెట్టి స్నేహం కోరుకుంటారు. అప్పటి నుంచి వారు శాశ్వతంగా స్నేహితులుగా గుర్తింపు పొందుతారు.


గోధుమలు నాటే క్రమంలో పవిత్ర గెడ్డ నుంచి ఇసుకను సేకరించేందుకు పూజలు చేస్తున్న దృశ్యం

బ్రిటీష్ కాలంలో ముఠాదారు వ్యవస్థ మొదలైంది. మండలంలోని సుంకరమెట్ట, కొత్తభల్లుగుడ, మాడగడ పంచాయితీలను కలుపుతూ మాడగడ ముఠాగా పిలిచేవారు. ఆ కాలంలో మాడగడ గ్రామంలో బలి ఉత్సవం(బలి పరోబ్) నిర్వహించేవారు. ఈ ఉత్సవాన్ని వరుసగా మూడేళ్లు నిర్వహిస్తే, ఆ తరువాత మూడేళ్లు నిర్వహించరు. 12 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవం ఈ ఏడాది ఆగస్టు 25న మొదలై ఈ నెల 5న ముగుస్తుంది. ఈ పండుగ విశేషాలు తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గిరిజనులకు ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేయడంతో అందరిలో ఆసక్తి నెలకొంది.

బలి ఉత్సవం ఇలా..

మొదటిరోజు ఊర్లో ఒక ఇంటి వద్ద రాట నిలబెట్టి అక్కడ పూజలు ప్రారంభిస్తారు. ఈ పూజలను మహిళా పూజారులే(ఒరియాలో వీరిని గుర్మాయినులు అంటారు) నిర్వహిస్తారు. మేళతాళాలతో 12 తెగలకు చెందిన 12 మంది అక్కాచెల్లెళ్లు (అన్నదమ్ముల భార్యలు)ఊరికి సమీపంలో ఉన్న పవిత్ర గెడ్డగా భావించే గెడ్డ వద్దకు వెళ్లి కొంత ఇసుకను సేకరించి తీసుకువస్తారు. ఒడిశా ప్రాంతం నుంచి గ్రామంలో ఉన్న బారికి (తలయారీ) గోధుమ విత్తనాలను సేకరించి తన ఇంటి వద్ద ఉంచుతారు. ఆ విత్తనాల కోసం వచ్చిన 12 మంది అక్కాచెల్లెళ్లకు బారికి నూతన వస్త్రాలు బహూకరించి, వారి కాళ్లకు మొక్కి సేకరించిన గోధుమ విత్తనాలను అందజేస్తాడు. ఆ అక్కాచెల్లెళ్లు ఆ విత్తనాలను పొలంలో నాటుతారు. విత్తనాలు మొలకెత్తిన సమయంలో గ్రామంలో ఉన్న మగ పూజారిపై వారు దైవంగా భావించే భీమదేవుడు ఆవహిస్తాడు. భీమదేవుడు ఆవహించిన పూజారికి గ్రామస్థులు పండ్లు, కాయలు, నైవేద్యం సమర్పిస్తారు. చివరి రోజున మొలకెత్తిన విత్తనాలను పొలంలో విడిచిపెడతారు. అంతకు ముందు పవిత్ర గెడ్డ వద్ద స్నేహాన్ని కోరుకునే వారికి 12 మంది అక్కాచెల్లెళ్లు బలిపుష్పాలను(మొలకెత్తిన విత్తనాలు) అందిస్తారు. వీటిని ఒకరి చెవిలో మరొకరు పెట్టి నాటి నుంచి స్నేహితులుగా గుర్తింపు పొందుతారు. అనంతరం వాటిని పవిత్ర గెడ్డలో విడిచిపెడతారు. ఇలా సంప్రదాయబద్ధంగా స్నేహాన్ని కోరుకునేవారు తరతరాలు ఈ స్నేహభావాన్ని కొనసాగించాల్సి ఉంటుంది.

వీఎంఆర్డీఏ కార్యాలయం ఎదుట నిర్వాసితుల ఆందోళన

- నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్


వీఎంఆర్డీఏ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమకు ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని అచ్యుతాపురం - అనకాపల్లి రోడ్డు నిర్వాసితులు బుధవారం వీఎంఆర్డీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ అభ్యంతరాలుంటే తెలియజేయాలంటూ వీఎంఆర్డీఏ అధికారులు వెబ్‌సైట్‌లో తేదీ లేకుండా నోటీసు పెట్టారన్నారు. అలాగే అంతకు ముందు ఆర్డీఓ, వీఎంఆర్డీఏ అధికారులు భూ నిర్వాసితులతో పలుమార్లు సమావేశాలు ఏర్పాటుచేసి అభిప్రాయాలు సేకరించారన్నారు. టీడీఆర్ బాండ్లు వద్దని, నగదు రూపంలో చెల్లింపులు జరపాలని, అంతేకాక 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని నిర్వాసితులు చెప్పారన్నారు. అయినా అధికారులు రెవెన్యూ గ్రామాల వారీగా పరిహారం టీడీఆర్ బాండ్ల రూపంలో చెల్లిస్తామని చెబుతున్నారని, దీనికి నిర్వాసితులెవరూ అంగీకరించడం లేదని చెప్పారు. రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు, షాపులు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణకు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కె.రామసదాశివ రావు, కర్రి అప్పారావు, భీముని వెంకటేశ్వరరావు, రాజాన సన్యాసి నాయుడు, తనకాల జగ్గారావు, బోడ్డేడ చిన అప్పల నాయుడు, జి.వెంకట్, లోకనాథం, మాడెం సూరి అప్పారావు, రొంగలి రాము తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో సామర్థ్యాలను గుర్తించాలి

- డీఈవో అప్పారావు నాయుడు
- చోడవరంలో ఉపకరణాల గుర్తింపు శిబిరం


శిబిరంలో దివ్యాంగ బాలుడిని పరిశీలిస్తున్న డీఈవో అప్పారావునాయుడు

చోడవరం, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ బాలల్లో దాగి ఉన్న సామర్థ్యాలను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందించినట్టయితే మరింతగా రాణించే అవకాశం ఉందని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు అన్నారు. స్థానిక కొత్తూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన అసెంబ్లీ నియోజకవర్గంస్థాయి దివ్యాంగ బాలలకు ఉపకరణాల గుర్తింపు శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రభుత్వం దివ్యాంగ బాలలకు ఉపకరణాలు అందించడంతోపాటు, వారికి మరిన్ని విభిన్న శిక్షణ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నదన్నారు. దివ్యాంగ పిల్లలను విధిగా భవిత పాఠశాలలకు పంపించాలని కోరారు. జిల్లా సహిత విద్య కో-ఆర్డినేటర్ కృష్ణంనాయుడు మాట్లాడుతూ, జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో దివ్యాంగ బాలల ఉపకరణాల గుర్తింపు శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైద్యాధికారులతోపాటు, ఎంఈవోలు పాండు రంగారావు, సింహాచలం, ప్రత్యేక ఉపాధ్యాయులు బీపీ రాజు, వరప్రసాద్, రాజా, జగన్నాథం, సీఆర్పీ కేవీఎం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు

- రాష్ట్రీయ బాలస్వాస్థ్య ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహించనున్న ప్రభుత్వం
- ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల కోసం విశాఖలోని మెడికవర్ ఆస్పత్రి ఎంపిక
- వెయ్యి మందిలో ఎనిమిది మంది శిశువులకు గుండె సమస్యలు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుండె జబ్బులతో పుట్టిన చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలను నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకువచ్చింది. ప్రస్తుతం తిరుపతిలోని పద్మావతి ఆస్పత్రిలో ఈ తరహా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. అయితే, ఉత్తరాంధ్రలో కూడా ఇటువంటి శస్త్రచికిత్సలను నిర్వహించాలని నిర్ణయించి, నగర పరిధిలోని మెడికవర్ ఆస్పత్రిని ఎంపిక చేసింది. ఉత్తరాంధ్రతోపాటు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ (డీఈఐసీ) సెంటర్ల ద్వారా గుర్తించిన చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించనున్నారు. ఇందుకోసం రూపాయి కూడా బాధిత చిన్నారుల కుటుంబ సభ్యులు చెల్లించాల్సిన అవసరం లేదు. ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు ఉంటే ఆ స్కీమ్‌లో, ఒకవేళ కార్డు లేకపోయినా ప్రత్యేక అనుమతి ద్వారా పిల్లలకు ఈ శస్త్రచికిత్సలు నిర్వహిస్తారు. నెల రోజులు కిందటే ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయాన్ని తీసుకున్నట్టు ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.

వేయి మందిలో నలుగురికి..

సాధారణంగా వేయి మందిలో ఎనిమిది మంది నవజాత శిశువులు గుండె జబ్బులతో పుడుతున్నట్టు వైద్యులు పేర్కొంటున్నారు. వారిలో నలుగురికి శస్త్ర చికిత్సలు నిర్వహించాల్సిన అవసరం ఏర్పడుతోంది. గతంతో పోలిస్తే ఈ తరహా బాధిత చిన్నారులు పెరుగుతున్నట్టు చెబుతున్నారు. సాధారణ ప్రసవాల్లో వేయి మందిలో 8 మందికి గుండె జబ్బు ఉంటే, ఐవీఎఫ్, ఇతర పద్ధతుల్లో పుట్టే చిన్నారుల్లో 15 నుంచి 20 మందికి గుండె సమస్యలు ఉంటున్నట్టు పేర్కొంటున్నారు. గుండె శస్త్రచికిత్సల నిర్వహణకు కార్పొరేటు ఆస్పత్రుల్లో అయితే కనీసం రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఖర్చవుతుంది. అంత ఖర్చు చేసే స్థోమత సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు ఉండదు. అటువంటి వారికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహణకు నిర్ణయించింది.

ప్రాథమిక దశలో గుర్తించేందుకు స్ర్కీనింగ్

డాక్టర్ బి.హారిక, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్

చిన్నారుల్లో ఉన్న అనారోగ్య సమస్యలను గుర్తించేందుకు ఏడాదికి రెండుసార్లు హెల్త్ స్ర్కీనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఆశ, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ వెళ్లి స్ర్కీనింగ్ చేస్తారు. ఎత్తు, బరువు, హెచ్‌బీతోపాటు ఇతర పరీక్షలు నిర్వహిస్తారు. సమస్య ఉన్నట్టు గుర్తించిన వారిని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి మరిన్ని పరీక్షలు చేస్తారు. అక్కడ ఏదైనా సమస్య ఉంటే జిల్లాస్థాయిలో ఉన్న డీఈఐసీకి రిఫర్ చేస్తారు. అక్కడ మరిన్ని పరీక్షలు నిర్వహించి తీవ్రమైన సమస్య ఉన్న వారికి శస్త్ర చికిత్సలు చేయిస్తాం. ఇప్పటివరకు గుండె జబ్బులు ఉన్న చిన్నారులను తిరుపతి పంపించి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నాం. ఇకపై ఇక్కడే నిర్వహించేలా ప్రభుత్వం ఒక ప్రైవేటు ఆస్పత్రిని ఎంపిక చేసింది. ప్రస్తుతం నెలకు ఒకటి, రెండు కేసులు తిరుపతికి పంపిస్తున్నాం. వారికి ఇక్కడే శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నాం.

క్రైం... crime news

వెనుక నుంచి బస్సు ఢీకొని ఒకరి మృతి

బుచ్చెయ్యపేట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. మండలంలోని కేపీ అగ్రహారం గ్రామానికి చెందిన జొన్నపల్లి ఈశ్వరరావు (55) సొంత పనిమీద బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బుచ్చెయ్యపేట వచ్చారు. బైక్‌ను పార్క్ చేసి, జెరాక్స్ సెంటర్ వద్దకు మెయిన్‌లో రోడ్డులో నడుచుకుంటూ వెళుతున్నారు. ఇదే సమయంలో ఒక ప్రైవేటు విద్యా సంస్థకు చెందిన బస్సు రివర్స్ తీసుకుంటూ ఈశ్వరరావును వెనుక నుంచి ఢీకొన్నది. దీంతో ఆయన బస్సు వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందారు. ఇతనికి భార్య లక్ష్మి, దివ్యాంగుడైన కుమారుడు వున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు వచ్చిన తరువాత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కాలుజారి చెరువులో పడి..

చోడవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోటవీధికి చెందిన జొన్నాడ శ్రీనివాసరావు (55) ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని పాతచెరువులో శవమై తేలాడు. ఇతను మంగళవారం బహిర్భూమి కోసం చెరువు వద్దకు వెళ్లి, ప్రమాదవశాత్తూ కాలుజారి నీటిలో మునిగి చనిపోయినట్టు స్థానికులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు పాతచెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీలకంఠపురంలో వివాహిత ఆత్మహత్య

బుచ్చెయ్యపేట సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) మండలంలోని నీలకంఠపురం గ్రామంలో వివాహిత ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త వేధింపులే ఆమె బలవన్మరణానికి కారణమని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా వున్నాయి.

బుచ్చెయ్యపేట మండలం నీలకంఠపురం గ్రామానికి చెందిన పడాల నరసింగరావుకు, అనకాపల్లి మండలం గొలగాం గ్రామానికి చెందిన జయ (26)తో ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. ప్రస్తుతం వీరికి ఇద్దరు పిల్లలు వున్నారు. నరసింగరావు పెయింటింగ్ పనులు చేస్తూ, వచ్చే డబ్బులతో మద్యం సేవిస్తున్నాడు. అంతేకాక భార్యతో తరచూ గొడవ పడుతున్నాడు. మద్యం అలవాటు మానుకోవాలని ఆమె పలుమార్లు కోరినప్పటికీ అతను పట్టించుకోలేదు. దీంతో మనస్తాపం చెందిన జయ.. బుధవారం ఉదయం ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన ఇక్కడకు వచ్చి, కుమార్తె మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరు అయ్యారు. అల్లుడు నరసింగరావు వేధింపులు తాళలేక తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. అల్లుడు, అతని తల్లిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడి చేయబోగా గ్రామస్థులు అడ్డుకుని వారించారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం చేయించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

అశ్లీల నృత్యాలు చేయించిన ఇద్దరిపై కేసు నమోదు

ఎలమంచిలి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలాపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి తీర్థం సందర్భంగా ఈ నెల 1వ తేదీ రాత్రి మహిళలతో అశ్లీల డ్యాన్సులు చేయించిన గ్రామ కమిటీకి చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ ఉపేంద్ర బుధవారం తెలిపారు. ములకలాపల్లిలో మహిళలతో అశ్లీల నృత్యాలు చేయించిన ఇద్దరిపై కేసు నమోదు చేయడంతో పాటు సౌండ్ సిస్టమ్‌ను సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు.

నాణ్యతగా పేదల ఇళ్ల నిర్మాణం

- గృహనిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు


కుంచంగిలోని ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న గృహనిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు

కొత్తూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పేదల గృహ నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు సూచించారు. బుధవారం ఆయన అనకాపల్లి మండలం కుంచంగిలో ఎన్టీఆర్ పేదల కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు మాట్లాడుతూ, ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద ఈ నెల 15వ తేదీనాటికి రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేకపోతే సంబంధిత కాంట్రాక్టర్లు, ఆయా పనులను పర్యవేక్షించే అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయని, నాణ్యత పాటించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టామన్నారు. ఆయన వెంట హౌసింగ్ అధికారులతోపాటు టీడీపీ నాయకులు పచ్చికూర రాము, పల్లెల నాగేశ్వరరావు, పోలిన జగ్గారావు, రొంగలి సూరిబాబు, వెంకటేశ్ ఉన్నారు.

రేపు విశాఖకు సీఎం చంద్రబాబు

... 5వ పేజీ తరువాయి

నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 8.50 గంటలకు రుషికొండ వద్ద గల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి తొమ్మిది గంటలకు రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళతారు. ఉదయం పది నుంచి 11.30 గంటల వరకూ సదస్సులో పాల్గొంటారు. అనంతరం 11.30 గంటలకు హోటల్ నుంచి తిరిగి రుషికొండ హెలిప్యాడ్‌కు చేరుకుని 11.40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి ఉండవల్లి వెళతారని అధికార వర్గాలు తెలిపాయి. ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్, కామన్వెల్త్ లాయర్స్ అసోసియేషన్ ఈ సదస్సు నిర్వహిస్తున్నాయి. సదస్సుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పీఎస్ నరసింహం, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీఎస్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులు హాజరవుతారు.

గంజాయి వలలో యువత

... 5వ పేజీ తరువాయి

అల్లూరి, అనకాపల్లి జిల్లాల మీదుగా ఇతర జిల్లాలు/రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఒడిశాలో కిలో సుమారు రూ.5 వేలకు కొనుగోలు చేసిన గంజాయి.. రాష్ట్ర సరిహద్దులు దాటితే రూ.25 వేలు పలుకుతున్నది. గంజాయి రవాణాను నిరోధించడానికి ఏజెన్సీ ముఖద్వారాల వద్ద అనకాపల్లి జిల్లా పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. చింతపల్లి నుంచి నర్సీపట్నం వచ్చే మార్గంలో కొయ్యూరు మండలం డౌనూరు వద్ద చెక్ పోస్టు ఉంది. గంజాయి రవాణాదారులు ఈ చెక్‌పోస్టు తగలకుండా.. రొబ్బసింగి, బచ్చింత మీదుగా చేర వేస్తున్నారు. కృష్ణాదేవిపేట రూట్లో యర్రవరం చెక్‌పోస్టు తగలకుండా జోగుంపేట, తాండవ, చమ్మచింత, ఎదురుపల్లి, రౌతులపూడి మీదుగా కత్తిపూడి వద్ద జాతీయ రహదారికి చేరుతున్నారు. సీలేరు, ధారకొండ, జీకేవీధి, మీదుగా కొయ్యూరు మండలం అసనగిరి, సొల్లూరు మీదుగా రవాణా చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	121.00
లైవ్ ధర	141.00
విత్ స్కిన్	252.00
స్కిన్ లెస్	262.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579